మంగళవారం 19 ఆగస్టు 2025
https://www.telugudesam.org

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా మంతెన
- సహాయ మంత్రి హోదా ఇస్తూ జీవో జారీ

6



రూ. 904 కోట్లతో..

## రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు

- యుద్ధప్రాతిపదికన అమరావతి నిర్మాణాలు
- ఈ సీజన్‌లోనే రాజధానికి ఒక రూపం
- పలు కీలక ప్రాజెక్టులకు ఎస్పీవీ
- మంగళగిరిలో 'గోల్డ్ క్లస్టర్' కోసం భూ సమీకరణ
- కృష్ణా నదిపై ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్
- సీఆర్డీఏ అథారిటీలో 9 ప్రతిపాదనలకు ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం

2

*రాజధాని అమరావతిలో చేపట్టిన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా ఆ న్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సీజన్లోనే నిర్మాణాలను పూర్తిచేసి రాజధానికి ఒక రూపం తీసుకురావాలన్నారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. రాజధాని పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో రూ.904 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్డీఏ సమావేశంలో నిర్ణయించారు.*

## స్త్రీశక్తికి అద్భుత స్పందన

- సోమవారం ఒక్క రోజే 18 లక్షల మంది ఉచిత ప్రయాణాలు
- జీరో ఫేర్ టికెట్ ద్వారా రూ.7 కోట్లకు పైగా ఆదా
- 4 రోజుల్లో 47 లక్షల మంది ప్రయాణం..రూ.19 కోట్ల లబ్ధి
- గుర్తింపు కార్డు సాఫ్ట్ కాపీ చూపినా ఉచిత ప్రయాణానికి ఓకే
- ఘాట్ రూట్లలో కూడా పథకం వర్తింపు
- ఉచిత బస్సు ప్రయాణ పథకంపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం స్త్రీశక్తికి అద్భుతమైన స్పందన కనిపిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం అమలు తీరుపై ఆర్టీసీ ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకీ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందన్నారు. సోమవారం ఒక్క రోజే 18 లక్షల మందికి పైగా మహిళలు జీరో ఫేర్ టికెట్‌తో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. దీంతో వారికి రూ.7 కోట్లకు పైగా ఆదా అయింది. పథకం ప్రవేశపెట్టిన నాలుగు రోజుల్లో 47 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోగా.. దాదాపు రూ.19 కోట్ల మేర వారికి ఆదా అయిందన్నారు. ఘాట్ రూట్‌ల్లోని ఆర్టీసీ సర్వీసుల్లో కూడా స్త్రీ శక్తి పథకం అమలుకు ముఖ్యమంత్రి అంగీకారాన్ని తెలిపారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ప్రయాణించే మహిళల గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ జిరాక్సుతో పాటు మొబైల్ డిజిటల్ లాకర్లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మరోవైపు రోజువారీ ప్రయాణంలో తమకు ఎంత మేర ఆదా అవుతుందన్న అంశాలను మహిళలు తమతో సంతోషంగా పంచుకుంటున్నట్టు సీఎంకు అధికారులు తెలిపారు. స్త్రీశక్తి పథకం వర్తించే సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు లోపలా బయటా బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.



మూడు రోజుల్లో

## ఏపీకి యూరియా

- 29వేల మెట్రిక్ టన్నులు పంపేందుకు కేంద్రమంత్రి నడ్డా అంగీకారం
- మంత్రి లోకేష్ విజ్ఞప్తికి స్పందన

- వివరాలు 4 లో..

త్వరతగతిన

## బీపీసీఎల్ రిఫైనరీ

- నిర్మాణానికి సహకారం అందించండి
- కేంద్ర పెట్రోలియం మంత్రికి లోకేష్ వినతి

- వివరాలు 4 లో..



## విశాఖలో డేటా సిటీ

- ఏర్పాటుకు సహకారం అందించండి
- విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో భేటీలో మంత్రి నారా లోకేష్ వినతి

- వివరాలు 4 లో..

విషం చిమ్మడం,

## తప్పుడు ప్రచారం



- వైసీపీపై సీఎం చంద్రబాబు మండిపాటు
- పార్టీనేతలు ఎప్పటికప్పుడు ఖండించాలి
- చేసిన మంచి గురించే కాదు.. చెడు చేసేవారి గురించీ ప్రజలను చైతన్యపరచాలి
- సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం
- చెప్పినవన్నీ చేశాం కాబట్టే ప్రజల్లో సానుకూల స్పందన
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు మరింత బాధ్యతగా ఉండాలి
- నెలాఖరుకు పార్టీ కమిటీలు పూర్తి
- పులివెందుల, ఒంటిమిట్టలో గెలుపుపై అభినందనలు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్

2

## ప్రాణ, ఆస్తి నష్టం ఉండొద్దు

- వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఉత్తరాంధ్రలో తాజా పరిస్థితిని వివరించిన సీఎస్ విజయానంద్




3

ప్రజలను భయపెట్టేలా

## వైసీపీ దుష్ప్రచారం

- వరదలపై తప్పుడు వార్తలు క్షమించరాని నేరం
- చర్యలు తప్పవని మంత్రి నిమ్మల స్పష్టీకరణ

7



## కాగ్ అంకెలకు వైసీపీ వక్రభాష్యం

- ఇదిగో జగన్‌రెడ్డి మీ తారుమారు లెక్కలు
- 2014 గ్రాంట్స్ కలిపి ఆదాయంగా చూపుతారా?
- గణాంకాలను తారుమారు చేసి తప్పుడు ప్రచారమా?
- బుగ్గనా.. ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం ఆపు
- బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ ఎన్.విజయ్‌కుమార్

9




# విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం

- వైసీపీపై సీఎం చంద్రబాబు మండిపాటు
- పార్టీనేతలు ఎప్పటికప్పుడు ఖండించాలి
- చేసిన మంచి గురించే కాదు.. చెడు చేసేవారి గురించీ ప్రజలను చైతన్యపరచాలి
- సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం
- చెప్పినవన్నీ చేశాం కాబట్టే ప్రజల్లో సానుకూల స్పందన
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు మరింత బాధ్యతగా ఉండాలి
- నెలాఖరుకు పార్టీ కమిటీలు పూర్తి
- పులివెందుల, ఒంటిమిట్టలో గెలుపుపై అభినందనలు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్యరథం): నిత్యం విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం చేయడమే వైసీపీ పని అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆక్షేపించారు. రాజధాని అమరావతి మునిగిపోయిందని.. ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయంటూ సొంత టీవీ, పత్రికలు, అనుబంధ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లు, జోనల్ కో-ఆర్డినేటర్లు, గ్రామ, మండల స్థాయి కార్యకర్తలతో సోమవారం సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహణ, పార్టీ కమిటీల నియామకం, తదితర అంశాలపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ దుష్ప్రచారంపై మాట్లాడుతూ తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించాలని నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాజధానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఊళ్లు మునుగుతాయని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాజధాని కోసం పొన్నూరును ముంచారని ఒకసారి వార్త వేశారు. కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పనిచేయడం లేదని మరోసారి ప్రచారం చేశారు. ప్రకాశం బ్యారేజ్ ప్రమాదంలో పడిందని మరో వార్త వేశారు. తప్పుడు ప్రచారంతో గందరగోళం సృష్టించాలని వైసీపీ యత్నిస్తోంది. వీటిని ఎప్పటికప్పుడు ఖండించాలి. ఈ విషయంలో మంత్రులు, పార్టీ నేతలు చొరవ చూపాలి. ఖండించకపోతే తప్పుడు ప్రచారాలనే నిజం అనే స్థాయికి తీసుకెళ్తారు. మంచి గురించే కాదు.. చెడు చేసేవారి గురించీ ప్రజలను చైతన్య పరచాలని సీఎం చంద్రబాబు సూచించారు.

### చెప్పినవి చేస్తున్నాం కాబట్టే ప్రజల్లో సంతృప్తి

రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం కోసం, ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం అయ్యింది. సాంకేతికతను ఉపయోగించుకుని ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకాలను వివరించాం. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 1.24 కోట్ల కుటుంబాలను నేరుగా కలిశాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు ఏ గ్రామానికి ఏ సమయంలో వెళ్తున్నారో యాప్ ద్వారా తెలుసుకున్నాం. అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చూస్తే.....ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతోంది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలను, నేతలను ప్రజలు ఆహ్వానించారు...ప్రభుత్వాన్ని దీవించారు. ఇదొక సానుకూల సూచిక. ఎన్నికల్లో చెప్పిన విధంగా సూపర్ 6 పథకాలను అమలు చేస్తున్నాం కాబట్టే ప్రజల్లో ఈ స్థాయి సంతృప్తి వ్యక్తం అయ్యింది.



పింఛన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి- ఉచిత బస్సు ప్రయాణ పథకాలను చెప్పిన విధంగా అమలు చేశామని సీఎం చంద్రబాబు అన్నారు.

### కష్టపడ్డవారికే పదవులు

ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. దీని కోసం నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలి. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల కోసం నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నాం. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌లను నియమించాం. ఇతర పదవుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని సీఎం చంద్రబాబు తెలిపారు.

### మరింత బాధ్యతగా ఉండాలి

రాష్ట్రంలో నేర చరిత్ర కలిగిన ఒక పార్టీ ఉంది. వాళ్ల పని నిత్యం విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం చేయడమే. సోషల్ మీడియా, సొంత టీవీ, పత్రికల్లో, అనుబంధ మీడియాతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళ పరచాలి అనే సిద్ధాంతంతోనే వైసీపీ నిత్యం పనిచేస్తోంది. వైసీపీ చేస్తున్న ఏ ప్రచారాన్ని పరిశీలించినా వాళ్ల కుట్ర ఏంటో అర్థం అవుతుంది. మనపై చేసే అసత్య ప్రచారాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంఛార్జ్‌లు, కార్యకర్తలు మరింత క్రమశిక్షణతో ఉండాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు మరింత బాధ్యతగా ఉండాలి... మీ మాట, మీ చర్య పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉండకూడదు. వివాదాలకు ఏ ఒక్కరూ ఆస్కారం ఇవ్వకూడదు. రాజకీయ ముసుగులో ఉండే రౌడీలను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో కఠినంగా ఉంటాం. పార్టీ కమిటీలను సాధ్యమైనంతవరకు ఈ నెల చివరికి పూర్తి చేయాలి. దీనికి సంబంధించి పనిని వేగవతం చేయాలి. ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్‌లతో ముఖాముఖి భేటీ అవుతున్నాను. మంచి చెడులు వారితో చర్చిస్తున్నాను. పొరపాట్లు ఉంటే సరిదిద్దుతూ సూచనలు ఇస్తున్నా. ప్రజలు మనపై అనేక ఆశలు పెట్టుకున్నారు. వారి ఆకాంక్షలను తీర్చేలా నేతల, ప్రభుత్వ పనితీరు ఉండాలి. దీన్ని మనసులో పెట్టుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

### ప్రజలతో మమేకమయితే..

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, నేతలను అభినందిస్తున్నాను. టీడీపీ అభ్యర్థులను గెలిపించి కాలర్ ఎగరేసి తిరిగేలా, గర్వపడేలా అంతా పని చేశారు. వివేకానందరెడ్డికి న్యాయం చేయండి, 30 ఏళ్ల తర్వాత ఓటు వేసే అవకాశం కల్పించినందుకు దండాలు అని బ్యాలెట్ బాక్సుల్లో స్లిప్పులు రాసి వేశారు. ఇది పులివెందులలో ఇన్నాళ్ల పరిస్థితికి అద్దం పడుతోంది. కానీ ఇప్పుడు ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు చట్టబద్ధంగా వ్యవస్థలు పనిచేశాయి కాబట్టే అంత మంది పోటీ చేశారు. అంత మంది స్వేచ్ఛగా ఓట్లువేశారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక వచ్చినా కూటమి అభ్యర్థులు గెలవాలి. ప్రజలతో మమేకమై, వారి అవసరాలు తీర్చి, సమస్యలు పరిష్కరిస్తే ప్రతి ఎన్నికల్లోనూ సునాయాసంగా గెలుస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

---

## రూ.904 కోట్లతో..

# రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు

- అమరావతిలోని కీలక ప్రాజెక్టులకు ఎస్పీవీ
- మంగళగిరిలో 'గోల్డ్ క్లస్టర్' కోసం భూ సమీకరణ
- కృష్ణా నదిపై ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్
- సీఆర్డీఏ అథారిటీలో 9 ప్రతిపాదనలకు ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్ ఎంపిక చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కూచిపూడి నృత్య భంగిమ సహా వేర్వేరు నూతన డిజైన్లను పరిశీలించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం 9 ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. రాజధాని అమరావతిలో చేపట్టే వివిధ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటుకు సీఆర్డీఏ అథారిటీ తన ఆమోదాన్ని తెలియచేసింది. రాజధానిలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్, రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, రోప్ వే లాంటి ప్రాజెక్టులకు ఎస్పీవీ ఏర్పాటు చేసేందుకు అంగీకారాన్ని తెలిపింది. మంగళగిరి గోల్డ్ క్లస్టర్‌లో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఏర్పాటుకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూ సమీకరణ చేసేందుకు కూడా అథారిటీ ఆమోదించింది. మంగళగిరిలోని ఆత్మకూరు వద్ద 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు భూ సమీకరణ చేయాలన్న సీఆర్డీఏ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. దీని కోసం ప్రత్యేకంగా ఎల్పీఎస్ నిబంధనలకు కూడా అథారిటీ ఆమోదించింది. మరోవైపు గోల్డ్ క్లస్టర్ వద్ద ప్రత్యేక ఎకో సిస్టం వచ్చేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రూ.5 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని.. 20వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీఆర్డీఏ అథారిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామ పంచాయితీల్లో డ్రెయిన్లు, నీటి సరఫరా ఇతర మౌలిక సదుపాయాల కోసం ఎల్పీఎస్ జోన్స్ క్రిటికల్ ఇన్ ఫ్రా అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కింద రూ.904 కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూసమీకరణ పథకం కింద ఇచ్చే యాజమాన్య ధృవీకరణ సర్టిఫికెట్‌లో అసైన్డ్ అనే పదాన్ని తొలగించేందుకు కూడా సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. రాజధాని అమరావతి నగరంలో సీవరేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ. 411 కోట్లు, అలాగే వాటర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రూ. 376.60 కోట్లతో ఏర్పాటు చేసేందుకు అథారిటీ అంగీకరించింది. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు అదనపు భూ కేటాయింపులు చేసేందుకు సీఎం అధ్యక్షతన అథారిటీ ఆమోదం తెలిపింది. విట్‌కు 100 ఎకరాలు, ఎస్ఆర్ఎంకు 100 ఎకరాల చొప్పున అదనపు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది.

### ఈ సీజన్‌లోనే రాజధానికి ఒక రూపం

రాజధానిలో చేపట్టే నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేసేలా ఆన్ లైన్ లో ఉంచాలన్నారు. ఈ సీజన్‌లోనే నిర్మాణాలు పూర్తి చేసి రాజధానికి ఒక రూపం తీసుకురావాలన్నారు. ప్రత్యేక వాహక సంస్థ ద్వారా చేపట్టే స్పోర్ట్స్ సిటీ లాంటి ప్రాజెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్లను అనుసంధానించాలని సీఎం సూచించారు. రాజధాని ప్రాంతంలో కాలుష్య రహిత పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రతిష్టాత్మక బయో ఇంజినీరింగ్ యూనివర్సిటీ కూడా అమరావతికి రానుందని సీఎం పేర్కొన్నారు. దేశంలో మరే ప్రాంతానికీ లేని భౌగోళికపరమైన సానుకూలతలు అమరావతికి ఉన్నాయని... అందుకే ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతీ ప్రాజెక్టు పరిధిలోనూ ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సీఆర్డీఏ అథారిటీ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఎస్ కె.విజయానంద్, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీకి చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

చైతన్యరథం

# ప్రాణ, ఆస్తి నష్టం ఉండొద్దు

**వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష - ఉత్తరాంధ్రలో తాజా పరిస్థితిని వివరించిన సీఎస్ విజయానంద్**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షాలపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్‌తో సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. అల్ప పీడనం వాయుగుండంగా మారుతుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పలుచోట్ల నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడం, కొండప్రాంతాలు కోతలకు గురికావడంతో అధికారులు ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు కొనసాగితే విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలని సూచించారు. ప్రజలకు సమాచారం అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని... అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ముందస్తు సన్నద్ధతతో, అప్రమత్తతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.

# క్వాంటమ్ వ్యాలీకి ఆర్థిక సాయం

- కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు మంత్రి లోకేష్ వినతి
- ఆర్‌టిఐహెచ్‌లకు దన్నుగా నిలవాలి
- సెమీ కండక్టర్ యూనిట్ మంజూరుకు కృతజ్ఞతలు



న్యూఢిల్లీ (చైతన్యరథం): అడ్వాన్స్ డ్ టెక్నాలజీ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, క్వాంటమ్ ఆవిష్కరణలు, విధానపరమైన సంస్కరణల్లో ముందున్న ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించాలని కేంద్రానికి మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేయడంపై కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్టవ్‌కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఐటి పెట్టుబడులను ప్రోత్సహించడం వల్ల వలసలను తగ్గించి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవకాశం ఏర్పడుతుంది. టైర్ -3 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమ విస్తరించేలా ఆదాయపన్ను మినహాయింపులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం అత్యవసరంగా పర్మినెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూల్స్‌లో సవరణలు చేపట్టండి. విదేశీ క్లౌడ్ సర్వీసు ప్రొవైడర్లు భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి, ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపర్చడానికి ఇది



అనివార్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఐటీని అభివృద్ధి చేస్తూ, పరివర్తనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వీలుగా ఏఐ శిక్షణ, టెక్స్ట్ అండ్ డేటా మైనింగ్ (టీడీఎం) మినహాయింపుల కోసం సెక్షన్ - 52 కాపీరైట్ చట్టసవరణ చేపట్టాలని మంత్రి లోకేష్ కోరారు.

### అధికారికంగా ఆమోదం తెలిపాలి

భారతదేశంలో మొట్టమొదటి జాతీయస్థాయి క్వాంటమ్ క్లస్టర్‌గా అమరావతి క్వాంటమ్ వ్యాలీ పార్కుకు, రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)కు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అధికారికంగా కేంద్రస్థాయిలో ఆమోదం తెలపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. క్వాంటమ్ వ్యాలీకి రూ. 1000 కోట్లు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రూ. 300 కోట్లు సాయం అందించండి. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్‌ను సెంట్రల్ ఇన్నొవేషన్ అండ్ డిజిటల్ హెల్త్ మిషన్‌లో చేర్చండి. అమరావతిలో గ్లోబల్ క్వాంటమ్ సమ్మిట్, ఇండియా ఇన్నోవేషన్ వీక్ -2026 నిర్వహణకు అవకాశం కల్పించండి. అమరావతిలో నేషనల్ క్వాంటమ్ రిసెర్చి ఇనిస్టిట్యూట్, ఐఐటి/ఐఐఎస్‌సి సహకారంతో నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆధారిత డీప్‌టెక్ స్కిల్ అకాడమీ ఏర్పాటు చేయండి. జాతీయ విద్యావిధానం - 2020 (ఎన్‌ఈపీ) కింద ఫెలో షిప్ ప్రోగ్రామ్‌లు, ఏఐ యూనివర్సిటీ, పాఠశాల స్థాయిలో స్టెమ్ పాఠ్యాంశాలను ఏకీకృతం చేయడానికి కేంద్ర సహకారం అందించండి. డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్లోబల్ డేటా సెంటర్ల పెట్టుబడులను ఆకర్షించడానికి విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ పనులను వేగవంతం చేయండి. ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీ కండక్టర్స్, డిస్‌ప్లే ఫ్యాబ్ లు, గ్లోబల్ ఐటీ సామర్థ్యాల కోసం ఏపీ ప్రభుత్వం 2024-25లో ప్రకటించిన నూతన విధానాన్ని వివరిస్తూ విశాఖపట్నంలో ఐటి పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహకాలను అందించాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా..

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక ఇన్నొవేషన్ ఎకోసిస్టమ్, డేటా ఇంటిగ్రేషన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఏఐ అండ్ డీప్ టెక్, విజువల్ ఇంటెలిజెన్స్, పీపుల్ పర్సెప్షన్, పబ్లిక్ అలర్ట్ ప్లాట్‌ఫామ్‌ల పనితీరును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తమ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టుల్లో డేటా లేక్, RTGS లెన్స్, PGRS, CPGRAMS, అన్నదాత సుఖీభవ, డ్రోన్ మార్ట్, KPI డాష్‌బోర్డులు, AWARE ప్లాట్‌ఫామ్, ఉద్యోగుల పనితీరు ట్రాకింగ్ సాధనాలు ఉన్నాయని చెప్పారు. డేటా సెంటర్ పార్కు, క్వాంటమ్ వ్యాలీ, ఆర్‌టిఐహెచ్‌లను వికసిత్ భారత్ - 2047లో అంతర్భాగాలుగా బ్రాండింగ్ చేసేందుకు, ఆంధ్రప్రదేశ్‌ను జాతీయస్థాయి ఆవిష్కరణల్లో ముందంజలో ఉంచేందుకు కేంద్రం మద్దతు అందించాల్సిందిగా కోరారు. సమగ్ర డిజిటల్ నైపుణ్య పెంపుదల, ఇ-గవర్నెన్స్, డీప్ టెక్ పరిశోధన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న స్టెమ్ విద్య కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చించారు.

కాగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ర్యాపిడ్ టెక్ ఇంక్యుబేషన్, క్వాంటమ్, బయోటెక్, గ్రీన్ టెక్నాలజీ రంగాల్లో ఎంఎస్‌ఎంఇల ప్రోత్సాహానికి ఏపీలో సంస్కరణలను అమలు చేసేందుకు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్టవ్ అంగీకారం తెలిపారు.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కి సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి (చైతన్యరథం): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి సీఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.



# ఏపీలో జీడి, మిర్చి, మామిడి బోర్డులు

- ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌కు మంత్రి లోకేష్ వినతి



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అనేక కీలక వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ ఉత్పాదకత, మార్కెట్ అస్థిరత, ఎగుమతి పోటీతత్వంలో రైతులు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారు.. ఈ సమస్యను పరిష్కరించి సప్లయ్ చైన్‌ను బలోపేతం చేయడానికి రాష్ట్రంలో ప్రత్యేక వ్యవసాయ ఉత్పత్తుల బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కోరారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయుష్ గోయల్‌తో మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... జీడిపప్పు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండోస్థానంలో ఉందన్నారు. ఏపీలో 1.38లక్షల హెక్టార్లలో రైతులు జీడిపంట పండిస్తూ ప్రతిఏటా 1.68 లక్షల మెట్రిక్ టన్నుల జీడిపప్పును ఉత్పత్తి చేస్తున్నారు. ఎక్కువ వయసు కలిగిన జీడితోటల నుంచి ఉత్పాదకత తగ్గిపోవడం, పంటకోత తర్వాత మౌలిక సదుపాయాల లేమి వంటి సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాసెసింగ్ ఆధునీకరణ, పారదర్శకతమైన వ్యాపారం ద్వారా రైతులకు మెరుగైన ధరలను అందించేందుకు శ్రీకాకుళంలో జీడి బోర్డు మంజూరు చేయాలని మంత్రి లోకేష్ కోరారు.

రాష్ట్రంలో మరో ముఖ్యమైన పంట మిర్చిని 11.67లక్షల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. ధరల హెచ్చుతగ్గులు, దళారీలపై ఆధార పడటం, పంటకోత నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిర్చి రైతుల ఆదయాన్ని స్థిరీకరించి, ప్రపంచ వ్యాప్తంగా మిర్చి ఎగుమతులను పెంచడానికి గుంటూరులో మిర్చి బోర్డు ఏర్పాటు చేయండి. మామిడి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 2వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో ప్రతిఏటా దాదాపు 50లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి చేస్తున్నారు. బంగినపల్లి మామిడి పళ్లకు జీఐ గుర్తింపు ఉన్నప్పటికీ తక్కువ దిగుబడి, మౌలిక సదుపాయాల లేమి, మార్కెట్ యాక్సెస్ లేకపోవడంతో రైతులు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సప్లయ్ చైన్, ప్రపంచ పోటీతత్వాన్ని బలోపతం చేసేందుకు చిత్తూరులో మామిడి బోర్డును ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ కోరారు.

ఆంధ్రప్రదేశ్ కీలకమైన పారిశ్రామిక కారిడార్లతో వ్యూహాత్మక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. ఆయా కారిడార్ల పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నిధులు అవసరం. రాష్ట్రంలోని మూలపేట, చిలమత్తూరు, కుప్పం, దొనకొండలలో 4 కొత్త నోడ్‌లను అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. నీరు, విద్యుత్, రోడ్డు, రైలు వంటి మౌలిక సదుపాయాల కోసం రూ.5,811 కోట్ల గ్రాంట్ మంజూరు చేయండి. విజయవాడ చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) పరిధిలో చిత్తూరు నోడ్ కు అనుమతి ఇవ్వండి. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్ లకు సంబంధించి మాస్టర్ ప్లాన్లు ఇప్పటికే ఆమోదం పొందాయి. రెండు నోడ్ లకు టెండర్లు సిద్ధంగా ఉన్నాయి. ఈపిసి విడుదలకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ) ఆమోదం పెండింగ్ లో ఉంది. ఈ ప్రాజెక్టును వెంటనే అమలుచేసి పెట్టుబడులను ఆకర్షించేందుకు వెంటనే అనుమతులు మంజూరు చెయ్యమని లోకేష్ విజ్ఞప్తి చేశారు.

చైతన్యరథం

# విశాఖలో డేటా సిటీ

- ఏర్పాటుకు సహకారం అందించండి
- విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో భేటీలో మంత్రి నారా లోకేష్ వినతి
- ఇటీవలి సింగపూర్ పర్యటన, రాష్ట్ర అభివృద్ధిపై ఆ ప్రభుత్వంతో చర్చలను వివరించిన లోకేష్



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యోగాల కోసం ఇతరదేశాలకు వెళ్లే యువతకు సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నంలో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డేటా సిటీ ఏర్పాటుకు కేంద్రం సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో సోమవారం మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో డేటా సిటీని అభివృద్ధి చేయడం వల్ల భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ హబ్‌గా తయారవుతుందని, దీనికి కేంద్రం సహకారం కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లే కార్మికుల సంక్షేమం, భద్రత, గౌరవం కోసం ప్రవాస భారతీయ బీమా యోజన వంటి పథకాలను మరింత విస్తరించాలి. సంబంధిత ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏపీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయి స్కిల్ కాంక్లేవ్ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఇటువంటి కార్యక్రమాలకు నిరంతరం సహకారం అందించండి. వలస కార్మికులకు ఓవర్సీస్ ట్రైనింగ్, మైగ్రేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఫాస్ట్‌ట్రాక్ అనుమతులతోపాటు నిధులు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు.

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బృందం సింగపూర్ పర్యటన వివరాలు..వివిధరంగాల్లో రాష్ట్ర అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో జరిగిన చర్చల గురించి ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వివరించారు. దీనికి పూర్తి సహకారం కావాలని జైశంకర్‌ను లోకేష్ కోరారు.

## విదేశాల్లో 35 లక్షల మంది ప్రవాసాంధ్రులు

ఏపీకి చెందిన సుమారు 35లక్షల మంది ప్రవాసాంధ్రులు విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నారు. అమెరికాలో 10లక్షలు, గల్ఫ్ దేశాల్లో 8 లక్షలు, ఐరోపా దేశాల్లో 4 లక్షల మంది ప్రవాసాంధ్రులు ఉన్నారు. యుఎస్‌లో అక్కడ ప్రజల తలసరి ఆదాయం 70,000 డాలర్లు కాగా, ప్రవాసాంధ్రుల తలసరి ఆదాయం 1,26,000 డాలర్లుగా ఉంది. ఐరోపా దేశాలు, ఆస్ట్రేలియా, జపాన్, కొరియా, తైవాన్‌లతో మొబిలిటీ, మైగ్రేషన్ పార్ట్‌నర్ షిప్ అరేంజ్‌మెంట్(ఎంఎంపీఏ) భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడంలో కేంద్రం చర్యలు అభినందనీయం. ప్రపంచ నైపుణ్య రాజధానిగా భారత్‌ను తీర్చిదిద్దే ప్రయత్నాలకు ఆంధ్రప్రదేశ్ పూర్తి మద్దతునిస్తుంది. కార్మికుల భద్రత, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతానికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, రాష్ట్రస్థాయిలో ఆయా ఒప్పందాలను అమలుచేయడంలో ఏపీ ముందంజలో ఉంటుందని మంత్రి లోకేష్ వివరించారు.

## త్వరలో నైపుణ్యం పోర్టల్

స్కిల్ డెవలప్‌మెంట్, ఇనిస్టిట్యూషనల్ పార్ట్‌నర్ షిప్స్ కోసం నైపుణ్య భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడంలో ఏపీ ప్రభుత్వం చురుగ్గా పనిచేస్తోంది.ఇందులో రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో కలిసి జాయింట్ ట్రైనింగ్ అండ్ ఎసెస్‌మెంట్‌పై ట్విన్నింగ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. వివిధ పారిశ్రామిక సంస్థలు, ఉద్యోగార్థులను అనుసంధానించే ఏకీకృత వేదికగా నైపుణ్యం పోర్టల్‌ను త్వరలో ప్రారంభించబోతున్నాం. నైపుణ్యం కలిగిన యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలను కల్పించడానికి, పెట్టుబడులు,సాంకేతిక పరిజ్ఞానాన్ని రప్పించడానికి జపాన్, కొరియా, తైవాన్లతో కలసి మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్ట్‌నర్ షిప్ అరేంజ్‌మెంట్(ఎంఎంపీఏ) ఉమ్మడి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టిసారించాం. ప్రపంచ దయాస్పోరా వేదికగా ఐటి, సాంకేతిక ఆవిష్కరణలు, ఉన్నత విద్యరంగంలో పెట్టుబడులు,నాలెడ్జి ట్రాన్స్‌ఫర్ కోసం ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ యువతకు మెరుగైన విదేశీ ఉద్యోగావకాశాల కల్పనకు కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు డేటా షేరింగ్ సహకారాన్ని అందించాల్సిందిగా కేంద్రమంత్రి జైశంకర్‌కు మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# మూడు రోజుల్లో ఏపీకి యూరియా



- 29వేల మెట్రిక్ టన్నులు పంపేందుకు కేంద్రమంత్రి నడ్డా అంగీకారం
- మంత్రి లోకేష్ విజ్ఞప్తికి స్పందన


న్యూఢిల్లీ (చైతన్యరథం): ఏపీలో యూరియా సమస్యను తక్షణం పరిష్కరించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జేపీ నడ్డాను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ సోమవారం కేంద్రమంత్రి జేపీ నడ్డాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ముమ్మరంగా వ్యవసాయ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో యూరియా కొరత ఉన్నందున, వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి నడ్డా స్పందిస్తూ... ఈ నెల 21నాటికి ఆంధ్రప్రదేశ్‌కు 29వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తాం, రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక పరిశ్రమల అభివృద్ధి, యువతకు ఉపాధి కోసం ప్లాస్టిక్ పార్కు ఏర్పాటుకు సహకారం అందించాలని మంత్రి లోకేష్ కోరగా, జేపీ నడ్డా ఆమోదం తెలిపారు. విశాఖపట్నంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చి (ఎన్ఐపీఈఆర్) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి, ఇందుకు అవసరమైన 100 ఎకరాల భూమి సిద్ధంగా ఉందని లోకేష్ చెప్పారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 14నెలలుగా కొనసాగతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని లోకేష్ ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం, అమరావతి రాజధాని పనులు మళ్లీ పట్టాలెక్కాయని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్రప్రదేశ్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.



ఢిల్లీ పర్యటనలో ఉన్న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం తెలుగుదేశం పార్లమెంటు పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. తొలిసారిగా టీడీపీపీ కార్యాలయానికి వచ్చిన మంత్రి లోకేష్‌ను టీడీపీ, జనసేన ఎంపీలు ఘనంగా సత్కరించారు.

# త్వరతగతిన బీపీసీఎల్ రిఫైనరీ



- నిర్మాణానికి సహకారం అందించండి
- కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరికి మంత్రి లోకేష్ వినతి

న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో బీపీసీఎల్ సంస్థ నిర్మించే రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ త్వరితగతిన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సహకారం అందించాల్సిందిగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరితో మంత్రి లోకేష్ సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టు సమీపాన బీపీసీఎల్ సంస్థ 6వేల ఎకరాల్లో రూ.95వేల కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు సంబంధించి పనుల పురోగతిపై చర్చించారు. రిఫైనరీకి అవసరమైన అదనపు భూసేకరణను రాష్ట్రప్రభుత్వ అధికారులు సమన్వయం చేస్తున్నారు.

9 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో నిర్మితమయ్యే బీపీసీఎల్ రిఫైనరీ ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వేగవంతమైన అభివృద్ధి సాధించడమేగాక, 5వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయి. ఏడాది చివరకు బీపీసీఎల్ రిఫైనరీ ప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున అన్నివిధాల సహాయ, సహకారాలను అందిస్తున్నాం, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసేందుకు కేంద్రం తమవంతు సహకారాన్ని అందించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తీరం వెంట మారిటైమ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ లో దీపం-2 పథకం కింద బీపీఎల్ కుటుంబాలను బలోపేతం చేసేందుకు ప్రతిఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలండర్లను అందజేస్తున్నాం. దీనిని ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై)తో అనుసంధానం చేసి మరింత సమర్ధవంతంగా ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సహకరించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఎనర్జీ, మారిటైమ్ రంగాల్లో వ్యూహాత్మక పెట్టుబడులు,అనుమతులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిందిగా లోకేష్ కోరారు. విధానపరమైన సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో డిజిటల్ ప్లాట్‌ఫాం వినియోగం, టెక్నాలజీ అడాప్షన్‌కు రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతిపాదిత ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు, సాంకేతిక మద్దతు అందిస్తున్నందుకు కేంద్రమంత్రికి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

చైతన్యరథం

# కానూరు-మచిలీపట్నం రోడ్డు విస్తరణ

- తక్షణ చర్యలు తీసుకోవాలి
- కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి లోకేష్ వినతి

న్యూఢిల్లీ (చైతన్యరథం): విజయవాడలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు - మచిలీపట్నం నడుమ 6 లైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని కేంద్ర ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడతూ... ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కానూరు - మచిలీపట్నం రోడ్డు విస్తరణ ద్వారా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు రాజధాని ప్రాంత అభివృద్ధికి కూడా ఉపకరిస్తుందన్నారు. హైదరాబాద్ - అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్‌హెచ్ - 65 కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్ - గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా అదనపు పోర్టు లింకేజిని డీపీఆర్‌లో చేర్చండి. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించండి.




### విశాఖ, విజయవాడల్లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్లు

ఎన్‌హెచ్ - 16 వెంట విశాఖపట్నంలో 20 కి.మీ.లు, విజయవాడలో 14.7 కి.మీ.ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ప్లస్ మెట్రో కారిడార్లను నాగపూర్ మోడల్‌లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఎన్‌హెచ్ఎఐ, రాష్ట్ర మెట్రో రైల్ కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంతో డీపీఆర్ రూపకల్పన, వ్యయాన్ని భరించే అంశంపై చర్చ జరిగింది. ఏపీలో రీజనల్ కనెక్టివిటీ, డెవలప్‌మెంట్ కారిడార్ల అభివృద్ధిలో భాగంగా కర్నూలు - ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ-గుంటూరు నడుమ ఎన్ హెచ్ 544డి, కాకినాడ పోర్టు - ఎన్‌హెచ్ 216 నడుమ దక్షిణ రహదారి, కాణిపాక వినాయక దేవాలయం లింకు రోడ్డు నిర్మాణ పనుల చేపట్టాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

బెంగళూరు - చెన్నయ్ ఎక్స్‌ప్రెస్ హై వే (ఎన్ఇ-7) రహదారికి డైరెక్ట్ కనెక్టవిటీ కోసం కుప్పం-హొసూరు - బెంగుళూరు నడుమ 56 కి.మీ.ల మేర రూ.3వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రికి లోకేష్ విన్నవించారు. కుప్పం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (కాడా) ప్రాంతంలో పారిశ్రామిక పార్కు అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్... గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు.

రోడ్డు భద్రతా ప్రమాణాల మెరుగుదల, ట్రాఫిక్ రద్దీ నిర్వహణ, లాజిస్టిక్స్, పాసింజర్ కారిడార్ల ఇంటిగ్రేషన్ ఆవశ్యకతను వివరించారు. కేంద్రప్రభుత్వ సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతమైన భూసేకరణకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. స్థిరమైన మోడరన్ కనెక్టివిటీ కోసం గ్రీన్ కారిడార్లు, అధునాతన టోలింగ్, రియల్ టైమ్ ట్రాఫిక్ సమాచార వ్యవస్థల అభివృద్ధిలో కేంద్రం భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

## కొత్త ప్రాజెక్టులకు సహకరించండి



- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి లోకేష్ వినతి
- స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైనం

న్యూఢిల్లీ (చైతన్యరథం): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదారంగా ఆర్థిక సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతిని వివరించిన లోకేష్...ఏపీలో కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాల్సిందిగా నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తిచేశారు.

అంతకుముందు ఎక్స్ వేదికగా నిర్మలా సీతారామన్‌కు మంత్రి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ ఆర్థిక విధానాలను నడిపించడంలో ఆమె జ్ఞానం, అంకితభావం, ఉదారత మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు. ఆయురారోగ్యాలతో ఆమె దేశానికి మరిన్ని సంవత్సరాలు సేవ చేయాలని ఆకాంక్షించారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ(చైతన్యరథం): ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైననందుకు టీడీపీ తరపున శుభా కాంక్షలు తెలిపారు.మహారాష్ట్రతోపాటు పలురాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన అనుభవం రాబోయే రోజుల్లో దేశానికి సమర్ధవంతమైన సేవలు అందించడానికి ఉపకరిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరైన రాధాకృష్ణన్ తమలాంటి కొత్తతరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు.





## దుగరాజపట్నంలో పోర్టుతోపాటు షిప్ బిల్డింగ్ యూనిట్

- అభివృద్ధి చేయాలని కేంద్రానికి మంత్రి లోకేష్ వినతి
- కేంద్ర ఓడరేవులు, జలరవాణాశాఖల మంత్రి సర్బానందతో భేటీ



న్యూఢిల్లీ (చైతన్యరథం): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టుల ఆధారిత అభివృద్ధి, జలరవాణా ప్రాజెక్టులకు సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనవాల్‌తో సోమవారం మంత్రి లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద హామీ ఇచ్చిన దుగ్గిరాజపట్నం ఓడరేవును వేగవంతం చేయాలని కోరారు. నౌకానిర్మాణం, ఓడరేవు క్లస్టర్ అభివృద్ధి కోసం దుగరాజపట్నాన్ని గుర్తించారు. అక్కడ ప్రధాన ఓడరేవుతోపాటు 2వేల ఎకరాల్లో రూ.3,500 కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పోర్టు అనుబంధరంగాల్లో రూ.26వేల కోట్ల పెట్టుబడులు, 5వేల ప్రత్యక్ష, 30వేల పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయి. దీనిద్వారా నెల్లూరు జిల్లా ఆర్థికవృద్ధి పెరుగుతుంది. దుగరాజపట్నం పోర్టుకు రాష్ట్ర ఈక్విటీగా భూమిని ఇప్పటికే సేకరించి ఇచ్చాం, ఎస్‌పివి మోడల్ లో ప్రపంచస్థాయి భాగస్వాములను ఆకర్షించి పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానించాలన్నది ఏపీ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ వివరించారు.

### పోర్టులకు అనుసంధానంగా మ్యానుఫ్యాక్టరింగ్ క్లస్టర్లు

సాగర్ మాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.1.14లక్షల కోట్ల విలువైన 110 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ యాంకరేజి పోర్టుల్లో వార్ఫ్‌లు, స్లిప్ వేల అప్‌గ్రేడ్, జీవవైవిధ్యం కోసం రూ.200 కోట్లు మంజూరు చేయండి. గోదావరి - కృష్ణానదులపై కొత్త జలరవాణా మార్గాలు, కార్గో టెర్మినల్స్, ఫ్లోటింగ్ జెట్టీల అభివృద్ధికి రూ.127.5 కోట్లు మంజూరు చేయండి. పోర్టుల్లో రవాణా కార్యకలాపాల అభివృద్ధికి ఆయా పోర్టులకు అనుసంధానంగా మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

### జలరవాణా అభివృద్ధిపై దృష్టి

రివర్ టూరిజంను ప్రోత్సహించడంలో భాగంగా అమరావతి-విజయవాడ స్ట్రెచ్‌తో సహా పట్టణ జలమార్గాలను అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. పీపీపీ మోడల్ లో చేపట్టే ఈ ప్రాజెక్టుల వల్ల రోడ్లపై రద్దీని తగ్గించడమేగాక సరుకు రవాణా సులభతరం అవుతుంది. ఏపీలోని తీరప్రాంతంలో పోర్టు ఆధారిత అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, గ్లోబల్ కాంపిటీటివ్‌నెస్ పై దృష్టిసారించాం. ఏపీలో సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చే ఈ ప్రాజెక్టులకు కేంద్రం సహాయం అందించడంతోపాటు అనుమతులు మంజూరు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

చైతన్యరథం



# సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా మంతెన

### - సహాయ మంత్రి హెూదా ఇస్తూ జీవో జారీ

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాల సమన్వయ కర్తగా టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు నియమితులయ్యారు. రాజుకు సహాయ మంత్రి హెూదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2002 నుంచి 2007 వరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి కార్యక్రమాల సహ సమన్వయకర్తగా, అనేక కార్య క్రమాల్లో మీడియా సమన్వయకర్తగా రాజు పనిచేశారు. 2017-2023 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న రాజు పార్టీలో వివిధపదవులు నిర్వహించారు. 2007-2013 మధ్య కాలంలో తెలుగు యువత కార్యాలయ కార్యదర్శిగా.. ఆ తర్వాత 2013లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించిపార్టీ అధినేత చంద్రబాబు అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సమయంలో చంద్రబాబు నిర్వహించిన వస్తున్నా మీకోసం పాదయాత్రలో రాజు వాలంటీర్ల సమన్వయకర్తగా పని చేసి పాదయాత్ర సజావుగా సాగేలా తన వంతు పాత్ర పోషించారు. 2017లో శాసనమండలి సభ్యులుగా ఎన్నికయ్యారు. శాసనమండలిలో ప్రజా సమస్యలను.. పార్టీ గళాన్ని గట్టిగా వినిపించారు. మూడు రాజధానులపై శాసనమండలిలో చట్టం చేసేందుకు గత ప్రభుత్వం పన్నిన కుట్రను యువనేత లోకేష్ సారధ్యంలో సమర్థవంతంగా తిప్పికొట్టారు. మూడు రాజధానుల బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవడంలో సత్యనారాయణ రాజు తన వంతు పాత్ర పోషించారు. ఇక టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శాసన మండలిలో నారా లోకేష్ మీదకు నాటి అధికార పార్టీ నేతలు దూసుకొచ్చిన సమయంలో లోకేష్ మీద దాడి జరగ్గకుండా ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్‌తో కలిసి అడ్డుకున్నారు. 2022 నుంచి పార్టీ కార్యక్రమాల సమన్వయకర్తగా వ్యవహరిస్తూ చంద్రబాబు కార్యక్రమాలను కో-ఆర్డినేట్ చేసుకుంటూ..వాటిని సక్సెస్ అయ్యేలా చేశారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల సమన్వకర్తగా వ్యవహరించారు. పార్టీకి అత్యంత విధేయుడిగా ఉన్న రాజును తన కార్యక్రమాల సమన్వయ కర్తగా నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు గౌరవించారు. దాదాపు 10 మహానాడుల్లో వలంటీర్ల కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిచడం సత్య నారాయణ రాజు ప్రత్యేకత.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - మంత్రి అనగాని

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో మత్స్యకారులు ఈ ఐదు రోజులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని గమనిస్తూ, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవెన్యూ అధికారులకు, పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ఆస్తి, ప్రాణ రక్షణకు, వరద విపత్తును ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

## మద్యం నిందితుల బెయిల్ పిటిషన్లు కొట్టివేత

విజయవాడ (చైతన్యరథం): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో నిందితులకు ఎదురుదెబ్బ తగిలింది. ఎంపీ మిథున్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. వీరి పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగించిన న్యాయస్థానం.. సోమవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవిస్తూ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. వీరితో పాటు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లనూ కోర్టు కొట్టివేసింది.

# వరల్డ్ సిటీగా విశాఖ



- తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం
- పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తాం
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- హెూంమంత్రి అనితతో కలసి కైలాసగిరిపై త్రిశూలం ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన
- బీచ్ రోడ్ లో యూహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

విశాఖపట్నం (చైతన్యరథం): పర్యాటక రంగంలో విశాఖ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జ్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం సాయంత్రం కైలాసగిరిపై నూతనంగా చేపట్టబోతున్న త్రిశూలం ప్రాజెక్ట్‌కు హెూం శాఖ మంత్రి అనిత తో కలసి మంత్రి డా. స్వామి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్కే బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన యూహెచ్ 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియంను హెూంశాఖ మంత్రి అనిత తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఆకర్షణీయమైన ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని, అందులో భాగంగా పర్యాటక ప్రాంతం కైలాసగిరిని మరింత అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈస్ట్రన్ నావెల్ కమాండ్ విశాఖ జిల్లాలో ఉండడం మన అదృష్టమని, అందువల్ల పర్యాటక అభివృద్ధికి ఇక్కడ హెలికాప్టర్ మ్యూజియం ఏర్పాటు చేశారన్నారు. ఈ హెలికాప్టర్ 2007 నుండి 2024 వరకు దేశానికి సేవ చేసిందని మంత్రి తెలిపారు.

ప్రజల సందర్శనార్థం మ్యూజియం ఏర్పాటు చేశామన్నారు. పర్యాటక రంగానికి విశాఖ జిల్లాలో ఎనలేని అవకాశాలు ఉన్నాయని, ఐటీ రంగంతో పాటు టూరిజం రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని మంత్రి డా.స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, జిల్లా కలెక్టర్ హరేందర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కెఎస్ విశ్వనాధన్, ఈస్ట్రన్ నావెల్ కమాండ్ అధికారులు, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నారు
- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ మంత్రి సవిత
- సోమందేపల్లి నుంచి భారీ ట్రాక్టర్ ర్యాలీ
- భారీగా తరలివచ్చిన రైతులు

పెనుకొండ(చైతన్యరథం): అన్నదాతల బాగు కోరుకునే ప్రభు త్వం కూటమి ప్రభుత్వమని, రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ మొద ట విడత నిధులు జమ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞ తలు తెలియజేస్తూ మంత్రి సవిత ఆధ్వర్యంలో రైతులు భారీ ట్రాక్ట ర్ల ర్యాలీ చేపట్టారు. సోమందేపల్లి నుంచి పెనుకొండ మార్కెట్ యార్డ్ వరకూ 10 కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, కూటమి నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు. అనంతరం పెనుకొండ మార్కెట్ యార్డ్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారు. గత ప్రభుత్వంలో భ్రష్టు పట్టిన విద్యా వ్యవస్థను మంత్రి లోకేశ్ గాడినపెడుతున్నారు. ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తూ ప్రజలు పెట్టుకున్న నమ్మ కాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. అన్నం పెట్టే రైతన్న పెట్టుబడి కోసం ఎవ్వరిని చేయి చాపకూడదనే అన్నదాత సుఖీభవ పథకానికి చుట్టారు. ఏడాదికి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయా న్ని అందజేసేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నా మన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను జోడిస్తున్నామని, డ్రో న్స్, శాటిలైట్, సెన్సార్, డీప్‌టెక్ వినియోగిస్తున్నామని తెలిపారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు, వంద శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు అం దజేస్తున్నామని చెప్పారు. పొలం పిలిచింది కార్యక్రమంతో రాష్ట్రం లో సాగు పెంచేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకు న్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు అపర భగీరథుడని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు.



# ప్రజలను భయపెట్టేలా వైసీపీ దుష్ప్రచారం

## వరదలపై తప్పుడు వార్తలు క్షమించరాని నేరం - చర్యలు తప్పవని మంత్రి నిమ్మల స్పష్టీకరణ

పాలకొల్లు (చైతన్యరథం): లేనిపోని అనుమానాలు, ఆందోళనలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైసీపీది క్షమించరాని నేరమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. అవాస్తవాలు, అర్థసత్యాలతో ప్రశాంత ప్రజాజీవనానికి భంగం కలిగించే వాళ్లెవరైనా తీవ్ర నేరాగాళ్లతో సమానమేనన్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసి, అన్నదాతలకు వైసీపీ అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రజల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించడం, ఆందోళనలు సృష్టించడం క్షమించరాని నేరంగా ఆయన పేర్కొన్నారు. నీటి వనరుల పైన, నిర్వహణ సామర్థ్యం పైన విష ప్రచారం చేస్తూ ప్రజలపై వరద భయాన్ని రుద్దడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో 70 శాతం మందికి ప్రధాన వృత్తి, ఆదాయ వనరు వ్యవసాయ రంగం. అలాంటి వ్యవసాయ రంగానికి ఆధారమైన ఇరిగేషన్ శాఖను వైసీపీ పాలనలో విధ్వంసం చేశారన్నారు. ఈ శాఖను గాలికి వదిలేసిన చేతకాని వైసీపీ... నేడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు.

### భయాందోళనలకు గురి చేయడమే ధ్యేయం

పోలవరం కాఫర్ డ్యామ్‌కు గండిపడింది..బెజవాడ మునిగిపోతుంది.. పొన్నూరులో పొలాలు మునిగాయి.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతాయి.. అంటూ వైసీపీ, దాని రహస్య మిత్రులు లేనిపోని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. రాజకీయ ముసుగులో వారు చేస్తున్న విష ప్రచారంలో వీసమెత్తైనా వాస్తవం లేదని మంత్రి



రామానాయుడు తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వానికి రోజురోజుకీ జనాల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. పరిస్థితి ఇలాగే సాగితే వైసీపీ కూకటి వేళ్లతో కూలిపోతుందనే భయంతోనే వివిధ వేదికల ద్వారా విషం చిమ్ముతున్నారని విశ్లేషించారు. పోలవరం కాఫర్ డ్యామ్ పక్కనున్న రోడ్డుకి చిన్నపాటి గొయ్యిపడి మట్టి జారితే ... ఏకంగా కాఫర్ డ్యాంకి గండి పడ్డట్లుగా ప్రచారం చేశారంటే వారి అవగాహన ఏపాటిదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో పొలాలు మునిగిపోవడానికి .. కొండవీటి వాగు మళ్లింపు కారణం కాదన్నారు. పొన్నూరులో ఒకరోజు వ్యవధిలో 170 మి.మీ. నుండి 200 మి.మీ. వరకు భారీ వర్షపాతం నమోదైన కారణంగా వర్షపు నీరు పంటకాలువలు, మురుగుకాలువల ద్వారా పొలాల్లోకి చేరి మునిగిపోయాయన్నారు. కొండవీటి వాగు వరదనీటిని పంపింగ్ పథకం ద్వారా కృష్ణానదిలోకి మళ్లిస్తున్నారే గాని కృష్ణా కాలువలకు మళ్లించడం లేదన్నారు. కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ, గుంటూరు ఛానల్, అప్పాపురం ఛానల్‌ను వర్షాల కారణంగా మూసివేశారన్నారు.

కొండవీటి వాగు వరద నీటిని 16 గేట్ల ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ ద్వారా ప్రకాశం బ్యారేజీ లోకి మళ్లిస్తారన్నారు. గుంటూరు ఛానల్‌కు సాగునీటి సరఫరా కూడా ఇక్కడి నుంచే జరుగుతుందని అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్వహణ పనులు చేపట్టకుండా గాలికి వదిలేసిందన్నారు. 2019-4 మధ్య కరకట్ట విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ రెగ్యులేటర్ పునర్నిర్మాణం చేయవలసి ఉన్నప్పటికీ, ఆ పనిని గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. వారు చేసిన పాపాలను తాము ప్రక్షాళన చేసుకుంటూ వెళుతున్నామన్నారు. వైసీపీ హయాంలో అమరావతిపై అక్కసుతోనే.. కరకట్ట ప్రాజెక్టు ఆపేశారన్నారు. కొండవీటి వాగు వరదను ప్రస్తుతం 5-6 పంపుల ద్వారా రోజుకు 2000 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రకాశం బ్యారేజీకి ఎత్తిపోస్తున్నారు. మరో 3000 క్యూసెక్కుల వరద వచ్చినా, అన్ని పంపులను నడిపి పూర్తిగా నియంత్రించేందుకు ఏర్పాట్లు పక్కాగా చేశామన్నారు. ఎటువంటి ప్రమాదమూ లేదు.. ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు పచ్చి అబద్ధాలన్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించి అశాంతి వాతావరణం కల్పించడమే వారి ధ్యేయం అని మంత్రి నిమ్మల దుయ్యబట్టారు.

### తుంగభద్రకు ప్రమాదం లేదు

తుంగభద్ర ప్రాజెక్టు 3గేట్ల మార్పిడి పనులకు రూ.52 కోట్లు పరిపాలన అనుమతి ఇచ్చి టెండర్ల ద్వారా ఏజెన్సీకి పనులు అప్పగించామన్నారు. అప్పటివరకు భద్రతా చర్యలలో భాగంగా, 80 టీఎంసీల వరకు మాత్రమే నీరు నిల్వ చేయాలని తుంగభద్ర బోర్డు నిర్ణయం తీసుకుందని తెలిపారు. వర్షాకాలానికి ముందు సాధారణ పరిశీలనలో 7 గేట్ల ఆపరేషన్‌లో స్వల్పఇబ్బందులు గమనించి పటిష్టఏర్పాట్లు జరిగాయని, అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఆయకట్టు భూములకు నీటి సరఫరా విషయంలో ఖరీఫ్‌కు ఎటువంటి అంతరాయం ఉండదన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ప్రమాదంవంటి వార్తలుపూర్తిగా నిరాధారమని ప్రజలను భయపెట్టేందుకు రాజకీయ లబ్ధితో చేస్తున్న కుతంత్రపు విమర్శలే తప్ప వాటిలో వాస్తవం లేదని మంత్రి నిమ్మల తెలిపారు.

### మనుగడ ఉండదనే భయంతోనే..

ప్రకాశం బ్యారేజీ 67వ గేటు విరిగింది అనేది కూడా అబద్ధమేనన్నారు. గేటు సురక్షితంగానే ఉందన్నారు. గేటుకి సంబంధించిన రోలర్‌లో చిన్న సాంకేతిక సమస్యవల్ల గేటు ఆపరేషన్ నిలిపివేశామన్నారు. అసత్యాలు, అవాస్తవాలు ప్రచారంచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోలీస్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ అంతకంతకూ పెరుగుతుండడంతో భవిష్యత్తులో పార్టీ మనుగడ కష్టమనే విషయం గ్రహించిన వైసీపీ నేతలు విషప్రచారానికి దిగుతున్నారని మంత్రి నిమ్మల అన్నారు.

# ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావొద్దు

**- కొరత ఉన్న ప్రాంతాలకు త్వరితగతిన సరఫరా చేయాలి**
**- వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు**

విజయవాడ (చైతన్యరథం): ఎరువుల సరఫరాలో ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, ప్రణాళికబద్ధంగా జరిగేటట్లుగా సరైన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎరువుల పంపిణీ సజావుగా సాగుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుసుకున్న మంత్రి విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలాని సామున్, సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16.73 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు (యూరియా -6.22 లక్షల మెట్రిక్ టన్నులు, డి.ఏ.పి- 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, ఎం.ఓ పి- 0.70 లక్షల మెట్రిక్ టన్నులు, యస్ యస్ పి - 0.94 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ లు - 6.30 లక్షల మెట్రిక్ టన్నులు) అవసరం ఉందని మంత్రికి కమిషనర్ ఢిల్లీరావు వివరించారు. కేంద్రం నుండి ఆగస్ట్ నెలకు సంబంధించి రావాల్సిన ఎరువులు సరైన సమయంలో అందలేదని, దాంతో కొంతమేర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటివరకు 10.39 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చాయని, ప్రారంభ నిల్వలు 7.13 లక్షల మెట్రిక్ టన్నులతో కలిపి మొత్తం 17.53



లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులను రాష్ట్రంలోని రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. 10.96 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందచేశామని, 6.56 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంస్థలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను రైతులకు సకాలంలో అందచేశాం, అయినా కూడా పలు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ రైతులు ఇబ్బందులు పడుతున్నారో వెంటనే గుర్తించి ఆయా ప్రాంతాలకు మార్క్‌ఫెడ్ గోదాములలో నిల్వ ఉన్న ఎరువులను త్వరితగతిన ఆయా జిల్లాలలోని సహకార సంస్థలకు పంపాలని ఆదేశించారు. ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరలకు యూరియాను, డీఏపీని అమ్ముకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి రావల్సిన పెండింగ్ ఎరువుల విషయంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో చర్చించి, వేగంగా ఎరువులను అందచేయాలని కోరారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన ఎరువులు ఆర్ఎఫ్‌సీ రామగుండం నుండి 19,000 మెట్రిక్ టన్నులు, కాకినాడ పోర్ట్‌కు రావాల్సిన ఎరువులు కనీసం 30,000 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్ట్‌కు రావాల్సిన 18,500 మెట్రిక్ టన్నుల ఎరువులను సత్వరం వచ్చేలా చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వేగవంతంగా జిల్లాలకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని, 3 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా అందుబాటులో ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. కావాలని యూరియా కొరత సృష్టిస్తే ఎవరిని ఉపేక్షించమని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ జేడీ కృపదాస్, మార్క్‌ఫెడ్ జీఎం శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు తీరం దాటనున్న వాయుగుండం

**- కోస్తాకు భారీ వర్షసూచన**

అమరావతి (చైతన్యరథం): పశ్చిమమధ్య, వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం సోమవారం అర్ధరాత్రికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. మంగళవారం ఉదయానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో కోస్తా తీరం వెంబడి గంటకు 40-60కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సముద్రం అలజడిగా ఉంటుందని మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని సూచించారు. మంగళవారం కోస్తాలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి, కాకినాడ, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లో అక్కడక్కడ 25 సెం.మీ వర్షపాతం నమోదుకు అవకాశం ఉంది. పశ్చిమ గోదావరి, కోనసీమ, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీ పురం మన్యం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్.. బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూల్, కడప జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. భారీవర్షాలు, బలమైన గాలుల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు,గోడలు వద్ద ఉండరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతాల్లో, మన రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదుల వరద ప్రవాహం హెచ్చరిక స్థాయికు చేరనప్పటికీ వివిధ ప్రాజెక్టులలోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున ఆయా నదీ పరీవాహక ప్రాంత, లోతట్టులంక గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోట్లు, మోటర్ బోట్లు, స్టీమర్లలతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం, స్నానాలకు వెళ్ళడం లాంటివి చేయరాదని సూచించారు.

సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో 73మిమీ, మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో 66మిమీ, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 60.2మిమీ, అల్లూరి జిల్లా కొత్తూరులో 59.5మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.

# జూనియర్ కళాశాలగా కస్తూర్బా విద్యాలయం

- స్థలాన్ని పరిశీలించిన మంత్రి జనార్దన్‌రెడ్డి
- బనగానపల్లె కస్తూర్బాలో ఆకస్మిక తనిఖీలు





బనగానపల్లె(చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుం టున్న విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు,నాణ్యమైన విద్య అందించాలని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. బనగాన పల్లెలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బనగాన పల్లెలో ప్రస్తు తం ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని రూ.2.5 కోట్ల నిధులతో అదనంగా మరో ఆరు నూతన గదులు నిర్మించి జూని యర్ కాలేజీగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన భవనాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కేజీబీవీలో విద్యార్థినుల తరగతి గదులను పరిశీలించి ఆహార, వసతి సదుపాయాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న స్కూల్ బ్యాగులు, దుస్తుల నాణ్యత గురించి తెలుసు కున్నారు. గతంలో కంటే నాణ్యతగా ఉన్నాయని విద్యార్థులు సమాధానమిచ్చారు. తల్లికి వందనం అందరికీ వచ్చిందని ముక్తకంఠంతో చెప్పారు. మెనూ బాగుందని చెప్పారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సూచించారు. విద్యార్థినులను ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తమ బట్టలు శుభ్రం చేసుకోవడానికి దోబీఘాట్ కావాలని కోరగా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో తాగునీటి సదుపాయం, వాటర్ ప్లాంట్ పనితీరును స్వయంగా పరిశీలించారు. పాఠశాల స్టోర్ రూమ్‌లో ఆహార సామగ్రి నాణ్యతను, కిచెన్ రూమ్‌ను పరిశీలించి సూచనలు చేశారు.

# స్త్రీ శక్తితో మహిళల్లో నూతనోత్సాహం

- 2.62 కోట్ల మందికి కూటమి ప్రభుత్వం కానుక
- రోజుకు 25 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణం
- భద్రత దృష్ట్యా కొండ ప్రాంతాల్లో అనుమతించలేదు
- వైసీపీ చేస్తున్న విమర్శల్లో ఏ మాత్రం నిజం లేదు
- స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




అమరావతి(చైతన్యరథం): ఉచిత బస్సు ప్రయాణం పథకం 'స్త్రీ శక్తి'తో మహిళల్లో నూతనోత్సాహం తీసుకువచ్చిందని స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. చంద్రబాబు రాష్ట్రంలోని 2.62 కోట్ల మహిళల గౌరవార్థం స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఇచ్చిన కానుకగా తెలి పారు. ఈ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలు అవుతుం దని, రోజుకు దాదాపు 25 లక్షల మంది మహిళలు ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. సోమవా రం సచివాలయం ప్రచార విభాగంలో మీడియాతో ఆమె మాట్లాడా రు. రాష్ట్ర జనాభాలో దాదాపు 50 శాతం మంది మహిళలే ఉన్నా రని, వారి అభ్యున్నతిని కాంక్షిస్తూ అన్ని రంగాల్లో సమాన అవకా శాలు కల్పించాలనే లక్ష్యంతో 'స్త్రీ శక్తి' పథకాన్ని అమలు చేయ డం జరుగుతుందన్నారు. ఆర్టీసీకి ఉన్న మొత్తం బస్సుల్లో దాదాపు 74 శాతం అంటే 8,458 బస్సుల్లో రాష్ట్రంలోని మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, బాలికలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని చంద్రన్న ప్రభుత్వం కల్పిం చిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు మహిళలకు కలుగుతుందని, రోజు వారీగా పనిచేసుకునే మహిళలు, మహిళా ఉద్యోగస్థులు, విద్యార్థినులు చిరువ్యాపారులకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గి పోయిందన్నారు. ఈ స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేయడం వల్ల ప్రతి కుటుంబానికి ప్రయాణ ఛార్జీల రూపంలో నెలకు రూ.2000 నుంచి రూ.3000 వరకు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం పేద కుటుంబాల్లో ఆర్థిక పొదుపును తీసుకురావడమే కాకుండా శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లే, తీర్థయాత్రలు చేసే మహిళలు, వృద్ధులకు ఎంతోగానో ప్రయోజనకరంగా మారిందని వివరించారు.

### వైసీపీ విమర్శల్లో నిజం లేదు

స్త్రీశక్తి పథకాన్ని అన్ని పార్టీలు సమర్థిస్తుంటే వైసీపీ లేనిపో ని విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా కొండ ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లలో మహిళ ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించలేదన్నారు. వైసీపీ అక్కసుతో చేస్తున్న విమర్శల్లో ఏ మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలో భారీ వర్షాల కారణంగా నేడు అంగన్ వాడీలు అన్నింటికీ శెలవును ప్రకటించడం జరిగిందన్నారు. భారీ వర్షాల పరిస్థితుల ను బట్టి మంగళవారం అంగన్ వాడీలకు శెలవు ఇచ్చేది, లేనిది కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. రానున్న మూడేళ్లలో డోలీ రహిత గ్రామాలుగా గిరిజన గ్రామాలను తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. తొలి ఏడాదిలో రూ.7,500 కోట్ల బడ్జెట్‌ను గిరిజన సంక్షేమానికి కేటాయించడం జరిగిందని, అందులో ఇప్పటికే రూ.1,300 కోట్లను వెచ్చించి దాదాపు 60-70 శాతం గ్రామాలకు రోడ్ల సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని, రానున్న ముడేళ్లలో గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్ల కనెక్టివిటీని కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## రిటైర్డ్ డీఎంహెచ్‌వోకు

# పెన్షన్, గ్రాట్యుటీ నిలిపివేత

- వైద్య మంత్రి సత్యకుమార్ ఆదేశాలు
- లంచం తీసుకున్నట్లు ఏసీబీ నిర్ధారణ
- జైలుశిక్ష నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు



అమరావతి(చైతన్యరథం): గతంలో కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)గా పనిచేస్తూ రూ.30,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో నేడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. 2017లో ఆ అధికారి ఒక ప్రైవేట్ ఆసుపత్రి, స్కానింగ్ సెంటర్ సేవల కొనసాగింపునకు (రెన్యువల్) లంచం అడిగినట్లు సమాచారం అందడంతో అవినీతి నిరోధకశాఖ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయంలో 2019లో కేసు నమోదు చేసింది. కర్నూలు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం గత నెల ఇచ్చిన తీర్పులో సదరు వైద్యాధికారి లంచం తీసుకున్నట్లు నిర్ధారించింది. ఈ నేపథ్యంలో 2020లో పదవీ విరమణ చేసిన సదరు అధికారికి పింఛను, గ్రాట్యుటీ చెల్లింపులను తక్షణమే నిలిపివేయాలని వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఆదేశాలిచ్చారు. నియ మాల ప్రకారం ఆ అధికారికి పింఛను మొత్తంలో 75 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. మంత్రి ఆదేశాలతో ఈ నెల నుంచి పెన్షన్ చెల్లింపును నిలిపివేస్తారు. సవరించిన పెన్షన్ నిబంధనలు, 1980 ప్రకారం ముదుపుల కేసుల్లో దోషులుగా నిర్ధారణ అయిన వారికి పింఛను, గ్రాట్యుటీ చెల్లింపులు ఉండవు. ఈ కేసులో ఆయనకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పింది. ప్రస్తుత నియమాల ప్రకారం 62 ఏళ్లకు పదవీ విరమణ చేసిన డీఎంహెచ్ ఓలకు జీవితకాలం నెలకు సుమారు రూ.1,00,000కు పైగా పెన్షన్ పొందే అవకాశముంది. దీంతోపాటు సుమారు రూ.20 లక్షలు గ్రాట్యుటీ అందుతుంది. రూ.30,000 లంచానికి ఆశపడిన సదరు కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి ఈ మొత్తాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైంది.

# చంద్రబాబు దూరదృష్టితో పర్యాటకాభివృద్ధి



- ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ
- ప్రపంచ గిరిజన, ఫొటోగ్రఫీ దినోత్సవం

విజయవాడ(చైతన్యరథం): అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్స్ కౌన్సి ల్ ఆధ్వర్యంలో ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఏపీ ఫొటోగ్రాఫిక్ అకాడమీ సహకారంతో ప్రపంచ గిరిజన దినోత్సవం, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సోమవారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ హాజరై ప్రసంగించారు. ఫొటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాకుండా సమాజా న్ని, సంస్కృతిని, చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే శక్తివం తమైన మాధ్యమం. అదేవిధంగా గిరిజన సంప్రదాయాలు, జీవన విధానం మన భారతీయ సంస్కృతికి మూలస్తంభం. ఈ రెండింటి నీ కలిపి జరుపుకోవడం ఎంతో గౌరవకరమైన విషయమన్నారు.

రాష్ట్రానికి పునాదులు వేసిన చంద్రబాబు స్ఫూర్తితోనే ఈ రోజు పర్యాటక అభివృద్ధి సాధ్యమైంది. ఆయన తీసుకొచ్చిన పర్యాటక విధానం కారణంగా అనేక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఏపీ టూరిజం కొత్త దిశలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన దూరదృష్టి, ముందు చూపుతోనే ఏపీ టూరిజం దేశంలో అగ్రస్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గోళ్ళ నారాయణరా వు, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు కొంపల్లి సుందర్, డిజిటల్, ఫొటో జర్నలిజం చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, ఫొటోగ్రాఫర్లు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# 'కాగ్' అంకెలకు వైసీపీ వక్రభాష్యం

- ఇదిగో జగన్‌రెడ్డి మీ తారుమారు లెక్కలు
- 2014 గ్రాంట్స్ కలిపి ఆదాయంగా చూపుతారా?
- గణాంకాలను తారుమారు చేసి తప్పుడు ప్రచారమా?
- బుగ్గనా.. ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం ఆపు
- బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ ఎన్.విజయ్‌కుమార్



మంగళగిరి(చైతన్యరథం): 'కాగ్' నివేదికలో అంకెల ను కూడా వైసీపీ తారుమారు చేసి తిమ్మినిబమ్మి చేస్తుం దని టీడీపీ అధికార ప్రతినిధి, ఏపీ బయో డైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శిం చారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాల యంలో మీడియాతో మాట్లాడారు. సాక్షి టీవీలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఈ ఆర్థిక సంవత్సరం గణాంకాలను రెండేళ్ల క్రితం అంకెలతో పోల్చి.. రాష్ట్ర సొంత ఆదాయాన్ని, కేంద్రం నుంచి వచ్చిన రెవెన్యూ డెఫిసిట్‌ను కలిపి చూపిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం విఫలం అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఆదాయం మాకు రూ.58వేల కోట్లు వచ్చాయి..మీకు రూ.49కోట్లే అంటే మామూలు జనాలకు కూడా అర్థం కావాలి కదా.. 'కాగ్' నివేదికలో జూన్ నెలకు ఇచ్చిన అంకెలను అటూ ఇటూ మార్చి ప్రజల ముందు పెట్టారు. 'కాగ్' ఆడిటింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ అధీకృత సంస్థ. ప్రతి రాష్ట్రం, కేంద్రానికి సంబంధించి ప్రతినెలా ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ స్పష్టమైన ఆర్థిక అంకెలను నివేదిక రూపంలో ఇస్తుంది. ఆడిటింగ్‌కు సంబంధించి అదే ఫైన ల్. అయితే జగన్‌రెడ్డి ఆ 'కాగ్' అంకెలకు కూడా తనదైన వక్ర భాష్యాన్ని చెబుతూ గత సంవత్సరం తక్కువ ఆదాయం అంటూ నమ్మించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జీఎస్టీ మొదలుకుని అన్నింటినీ కూటమి ప్రభుత్వంలో తక్కువ అని చెప్పడానికి కుటిల రాజకీయాలు చేస్తున్నారు. ప్రజలు అదే నిజమని అనుకునే ప్రమా దం ఉందని..అందుకే వాస్తవాలు వివరిస్తున్నట్లు చెప్పారు.

### కేంద్రం గ్రాంట్స్‌ను కలిపేసుకుంటే ఆదాయం పెరిగినట్లా?

రాష్ట్ర సొంత ఆదాయం మూడు రకాలుగా ఉంది. రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంట్స్, రాష్ట్ర పన్నుల్లో కేంద్రం వాటా గా ఇచ్చేది. బుగ్గన కేంద్రం ఇచ్చే గ్రాంట్స్‌ను కూడా కలిపేసి మాట్లాడేస్తున్నారు. రాష్ట్ర ఆదాయం నెలకోసారి లెక్కిస్తారు. 2023 జూలైలో వారికి రూ.58 వేల కోట్లు ఆదాయం వచ్చిందని బుగ్గన తప్పుడు లెక్కలు చెబుతున్నారు. రెండేళ్ల తర్వాత కూడా కూటమి ప్రభుత్వానికి 2025 జూలైలో రూ.49 వేల కోట్లే వచ్చిందని విమ ర్శలు చేస్తున్నారు. కేంద్రం ఒక్క పథకానికి ఇచ్చే గ్రాంట్స్ ఒకే నెల లో రావాలని రూల్ లేదు. ఏ నెలలో అయినా రావచ్చు. 2023లో జూన్, జూలైలో రూ.15 నుంచి రూ.20 వేల కోట్లు కేంద్రం నుంచి గ్రాంట్స్ రూపంలో వచ్చాయి. 2014 రెవెన్యూ లోటు 2019 దాకా రాలేదు. అది కేంద్రం 2023లో విడుదల చేసింది. ఆ గ్రాంట్స్‌ను చూపించి మాకు ఎక్కువ ఆదాయం వచ్చిందని బుగ్గన మాట్లాడుతున్నారు. ఇన్ని రోజులు బుగ్గన ఆచితూచి మాట్లాడుతారని అనుకున్నా. కానీ తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదారి పట్టించేలా, మభ్యపెట్టేలా, ప్రభుత్వంపై విషప్రచారం చేస్తూ మోసం చేసేలా మాట్లాడుతున్నారని అర్థమైంది. 2023లో రూ.38,079 కోట్లు ఉంటే 2025లో ఈ ఏడాది రూ.45 వేల కోట్లు వచ్చింది. అంటే రూ.7 వేల కోట్లు ఆదాయం వచ్చింది. 2014లో రావాల్సిన గ్రాంట్స్‌ను 2023లో కలిపేసుకుని వచ్చిన ఆదా యం రూ.35 వేల కోట్లు. మొత్తం కలిపి రూ.58 వేల కోట్లు వచ్చి నట్టు తప్పుడు మాటలు చెబుతున్నారు. 2023 జూలైలో జీఎస్టీ రూ.14,905 కోట్లు, 2024 జూలైలో రూ.15,258, 2025లో జూలైలో రూ.16,574 కోట్లు వచ్చింది. రూ.2 వేల కోట్ల అదనంగా ఆదాయం వస్తే ఏదేదో చెప్పి కూటమి ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడవద్దని బుగ్గనకు హితవు పలికారు.

### లిక్కర్‌లో వేల కోట్లు దోపిడీ చేశారు

ఈనాడు ఎప్పుడు తప్పుడు కథనాలు ప్రచురించదు. సాక్షిలో ప్రచురించేంది మాత్రమే తప్పుడు కథనాలు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్‌శాఖలో 2023 జూలైలో రూ.3200 కోట్లు ఆదాయం వచ్చింది. 2024లో రూ.2559 కోట్లు, 2025లో రూ.3587 కోట్లు వచ్చింది. ఎకానమి దూసుకుపోతుందని దీని అర్థం. సేల్స్ ట్యాక్స్ 2023లో రూ.6300 కోట్లు వస్తే, 2025లో రూ.5875 కోట్లు ఆదాయం వచ్చింది. సేల్స్ ట్యాక్స్ మాత్రమే ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఎక్సైజ్‌శాఖలో 2023లో రూ.4900కోట్లు, 2024లో రూ.5000కోట్లు, 2025లో రూ.5681కోట్లు ఆదాయం వచ్చింది. రూ.800కోట్లు అదనంగా ఆదాయం కూటమి ప్రభుత్వానికి వచ్చింది. మద్యం ధరలు తగ్గించినా తాగేవాళ్లు ఎక్కువ ఏం కాలేదు. అదే సంఖ్యలో తాగుతున్నారు. అయినా మాకు రూ.800 కోట్లు ఆదాయం వచ్చింది. మీ హయాంలో లిక్కర్ సొమ్మంతా బయటినుంచి బయటికే తరలించారు. దాదాపు రూ.5,6 వేల కోట్లు దారిమళ్లించారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, బాలాజీలు కలసి బిగ్‌బాస్‌కు ఇస్తే ఎక్సైజ్ శాఖలో ఆదాయం ఎలా కనిపిస్తుంది. క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌తో హంద్రీనీవా పూర్తి చేశాం. కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. రూ.8500 కోట్లు పెట్టుబడుల కింద ఖర్చు పెట్టామని వివరించారు.

### కాంట్రాక్టర్లకు వేలకోట్లు దోచిపెట్టారు

వైసీపీ హయాంలో రూ.15,783 కోట్లు ఖర్చు చేశామని బుగ్గన చెప్పుకొచ్చారు. 2023లో రూ.1,400 కోట్లు ఖర్చు చేశారు. కానీ ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతకు ఒక్క నెలల్లోనే రూ.15 వేల కోట్లు దారాదత్తం చేశారు. గుంటూరులో అంబటికి నిధులు కేటాయించారు. అలాగే ఆగస్టులో రూ.900 కోట్లు, సెప్టెంబరులో రూ.1300 కోట్లు ఇచ్చారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు దోచిపెట్టి ఏం చేశారు. వైసీపీ హయాంలో క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్ ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్ట్ నిర్మించలేదు. ఏంబీఏ చదివిన వ్యక్తిని ఆర్థిక శాఖ మంత్రిని చేశారు. ఏం చూసి బుగ్గనను మంత్రిగా చేశారో నాకు అర్థం కావడం లేదు. రెవెన్యూ లోటు తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. అప్పులు రూ.45 వేల కోట్లు చేశామని బుగ్గన చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం అప్పులు చేశాం. 2023లో మీరు 4 నెలల్లో రూ.45వేల కోట్లు అప్పు చేశారు. 2025లో 4 నెలల్లో రూ.48వేల కోట్లు చేశాం. 3 వేల కోట్లు అదనంగా అప్పు చేశాం. 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. రూ.2684 కోట్లతో మహిళలకు రాయితీపై ఉచితంగా సిలిండర్లు ఇస్తున్నాం. ఆర్బీఐ లిమిట్స్‌తో అప్పు ఎక్కువ చేసుకునే వెసులుబాటు మాకు ఉన్నా తక్కువ అప్పే చేశాం. వైసీపీ హయాంలో పెట్టిన 3 నెలల బకాయిలు కూడా కట్టాం. రూ.10వేల కోట్లతో తల్లికి వందనం ఇచ్చాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.3173 కోట్లు అందజేశాం.

గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు ఇచ్చాం. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు పథకం ఇచ్చాం. 16,437 డీఎస్సీ పోస్టులు భర్తీ చేశాం. వైసీపీ హయాంలో ఒక్క ఉపాధ్యాయుడి పోస్టు అయినా భర్తీ చేశారా? అర్చకుల వేతనం రూ.15 వేలకు పెంచాం. ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనం ఇస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25వేలు, మత్స్యకారులకు రూ.250కోట్లు సాయం చేశాం. ఇలా అనేకం చేశాం. మీరు వేల కోట్లు అప్పులు చేసి ఏం చేశారు? ఒక ప్రాజెక్ట్ కట్టలేదు, ఒక పరిశ్రమను తీసుకురాలేదు. వైసీపీ, సాక్షి పత్రికకు ఆర్థిక అంశాలపై అవగా హన లేదు. కాగ్ నివేదికను తారుమారు చేసి ఏదేదో మాట్లాడు తున్నారని ధ్వజమెత్తారు. ధైర్యం ఉంటే వీధుల్లోకి వచ్చి జనానికి సేవ చేసి మెప్పు పొంది ఓట్లు పొందాలి కానీ, ఇలా తప్పుడు విమర్శలు, తప్పుడు కథనాలతో కాదు..అలా చేస్తే ప్రజల్లో మీరు ఇంకా చులకన అవుతారు. వైసీపీ పాలన కంటే టీడీపీ పాలన చాలా బాగుందని ప్రజలే మెచ్చుకుంటున్నారని తెలిపారు.

# రాజధానిపై వైసీపీ దుష్ప్రచారం

- మునిగి పోయిందంటూ తప్పుడు ప్రచారం
- జగన్‌రెడ్డికి ధైర్యముంటే వచ్చి చూడాలి
- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

మంగళగిరి(చైతన్యరథం): రాజధాని అమరావతి మునిగి పోయిందంటూ వైసీపీ నాయకులు, వారి అనుకూల మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వ రరావు తీవ్రంగా ఖండించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాల యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో 52 వేల కోట్లతో జరుగు తున్న నిర్మాణాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు బ్లూ మీడియా సహకారంతో విషప్రచారం చేస్తున్నారు. ఎక్కడో వాగులు పొంగిన దృశ్యాలను తీసుకువచ్చి అమరావతి మునిగిపోయిందంటూ ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు అని మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడం లేదని, కొండవీటి వాగు నీటితో పంటలు మునిగిపోయాయని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేశారు.. ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని ఖండిస్తూ ఫిర్యాదులు కూడా నమోదు చేసిన విషయాన్ని దేవినేని గుర్తుచేశారు. కంభంపాడు ప్రాంతంలో వాగులు పొంగిన దృశ్యాలను అమరావతితో కలిపి చూపించడం వైసీపీ బ్లూ మీడియా దుష్ప్రచారానికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. జగన్‌రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే అమరా వతి వచ్చి సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎస్ఆర్ఎం యూని వర్సిటీ చూసి వెళ్లాలి. అక్కడ నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో స్వయంగా పర్యవేక్షించి తెలుసుకోవాలి. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని లేదా బెంగళూరు ప్యాలెస్‌లో సత్కారాలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం తప్ప వేరే పనిచేయడం లేదని ధ్వజమెత్తా రు. జగన్ పాలనలో అమరావతి రైతులపై దమనకాండ నడిపా రని, వేలాది కేసులు పెట్టి జైలుకు పంపారని, పనులు ఆపేసి మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసగించారని విమర్శిం చారు. అదే కారణంగా ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమి తం చేశారు. తాజాగా పులివెందుల, ఒంటిమిట్టలో కూడా వైసీపీ ఓటమిపాలైంది. డిపాజిట్లు కోల్పోయే స్థితికి పడిపోయింది. ఇంత పరాభవం ఎదురైనా జగన్ అసలు సత్యాన్ని అంగీకరించకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

### సూపర్‌సిక్స్ పథకాలే వైసీపీ అసహనానికి కారణం

చంద్రబాబు సర్కారు ప్రారంభించిన సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమవుతున్నాయి.



రైతులు, మహిళలు, పింఛన్‌దారులు అందరూ లబ్ధి పొందుతున్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, మూడు గ్యాస్ సిలిండర్లు, విద్యా పథకాలు విశేష ఆదరణ పొందుతున్నాయి. మహిళలు సోషల్ మీడియాలో తమ ఖాతాల్లో డబ్బులు పడుతున్న వీడియోలు పంచుకుంటుంటే జగన్ తట్టుకోలేక అసహనంతో ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

### స్వాతంత్ర్య వేడుకల్లోనూ పాల్గొనలేదు

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కూడా జగన్ హాజ రుకాలేదని విమర్శించారు. దేశమంతటా అమరవీరులను స్మరిం చుకుంటూ జాతీయ పతాకాలు ఎగురవేస్తున్న వేళ, జగన్ మాత్రం ప్రజల ముందుకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో తలదాచుకున్నా రు. ఓటమి భయం, మానసిక అసహనం ఆయనను ఇంతలా దిగ జార్చిందని ఎద్దేవా చేశారు. అమరావతి మునిగిపోయిందంటూ తప్పుడు కథనాలు ప్రచారం చేసే బ్లూ మీడియా, సోషల్ మీడియా పేజీలపై ప్రభుత్వం ఇప్పటికే కేసులు నమోదు చేసిందని గుర్తుచే శారు. ఇకపై కూడా ఎవరైతే ఇటువంటి ఫేక్ న్యూస్ వ్యాపింపజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలు మార్చాలి

- ఉన్నత ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించాలి
- పేద విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి
- 100 శాతం ఉత్తీర్ణత, సీట్ల భర్తీ జరగాలి
- వార్డెన్లు గార్డియన్‌గా వ్యవహరించాలి
- విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- మెనూ పర్యవేక్షణకు కమిటీలు వేయాలి
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- తొమ్మిది జిల్లాల అధికారులతో సదస్సు



విశాఖపట్నం(చైతన్యరథం): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య అందించడం ద్వారా వారు పరిశుభ్ర, ఆరోగ్యకర, సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునే పరిస్థితులు కల్పించే దిశగా సంక్షేమ అధికారులు హాస్టళ్లలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు కృషిచేయాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. నగరంలోని రుషికొండ గీతం విశ్వవిద్యాలయంలోని మదర్ థెరిసా ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమశాఖ ప్రాంతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం,పార్వతీపురం మన్యం,విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డా.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి తదితర తొమ్మిది జిల్లాలకు చెందిన సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు, సంక్షేమ అధికారులు, సహాయ సంక్షేమాధికారులు, హాస్టళ్ల సంక్షేమాధికారులు 230మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. హాస్టళ్లలో సీట్ల భర్తీ, టెన్త్, ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత, హాస్టల్ భవనాల మరమ్మతులు, డైట్ బిల్లుల చెల్లింపు, పారిశుద్ధ్య నిర్వహణ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజన వసతి కల్పించడం, హాస్టళ్ల తనిఖీలు తదితర అంశాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ డైరెక్టర్ లావణ్యవేణి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌లతో కలసి మంత్రి జిల్లాల వారీగా, అంశాల వారీగా సమీక్షించారు. విద్యార్థులకు వార్డెన్‌లే గార్డియన్‌లుగా ప్రతిభావంతులైన విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించి గత ఏడాది నీట్‌లో కొద్దిపాటి ర్యాంకు తేడాతో సీట్లు పొందలేకపోయిన ఎస్సీ విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది సీటు సాధించలేని వారు ఉంటే వారిని లాంగ్ టర్మ్ కోచింగ్ వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. హాస్టళ్లలో చదివిన ఏ ఒక్క విద్యార్థి టెన్త్, ఇంటర్‌లో ఫెయిల్ కావడానికి వీల్లేదని స్పష్టంచేశారు.

### 100 శాతం సీట్ల భర్తీ కావాలి

హాస్టళ్లలో వందశాతం ప్రవేశాలు జరిగి సీట్లన్నీ భర్తీ కావాలని స్పష్టంచేశారు. 100శాతం సీట్ల భర్తీ వచ్చే ఏడాది నుంచి జరగాలని స్పష్టంచేశారు. ఈ ఏడాది వరకు కనీసం 75శాతం సీట్లు భర్తీ కావాలన్నారు. హాస్టళ్లలో చదివే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి హాస్టల్ నుంచి బయటకు వెళ్లాలన్నారు. వచ్చే ఏడాది నుంచి నూరు శాతం హాస్టల్ సీట్లు భర్తీచేయలేని వార్డెన్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షించాలి

హాస్టళ్ల విద్యార్థులకు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యాధి కారులతో ఆరోగ్య తనిఖీలు చేయిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతి నెలా వైద్యాధికారులు,వారానికోసారి ఏఎన్ఎంల ద్వారా ఆరోగ్య తనిఖీలు చేయించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిత్యం గమనిస్తూ ఏ విద్యార్థి అయినా అనారోగ్యానికి గురైన వెంటనే తక్షణ వైద్యం అందించాలని సూచించారు.వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, హాస్టళ్లలో నీరు నిల్వలేకుండా చూడటం,వేడిచేసిన నీటిని అందించడం, పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరి చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మంత్రి ఆదేశించారు. మెనూ అమలుపై పర్యవేక్షణకు విద్యార్థులతో కూడిన కమిటీలు వేయాలని చెప్పారు.

హాస్టళ్లలో అందిస్తున్న ఆహారం నాణ్యతపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. వార్డెన్లు విద్యార్థులతోపాటుగా హాస్టళ్లలోనే బసచేయాలని చెప్పారు. బయటకు వెళ్లి రోడ్డు పక్కన దొరికే తినుబండారాలతో అస్వస్థతకు గురవుతున్నారని, హాస్టల్‌లోనేవారికి ఆరోగ్యకర ఆహారాన్ని అందించాలన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ఉప సంచాలకులు కె.రామారావు, రాష్ట్ర కార్యాలయం డీడీ లక్ష్మీసుధ, అన్ని జిల్లాల డీడీలు, ఏఎస్‌డబ్ల్యూవోలు, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఆవరణలో శరవేగంగా అదనపు భవన నిర్మాణం



- పనులను పరిశీలించిన మంత్రి నారాయణ
- ఈ నెల 25కు సోమవారానికి అందుబాటులో తెస్తామన్న అధికారులు

అమరావతి (చైతన్యరథం): అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం పరిశీలించారు. భవన నిర్మాణం మొత్తం 1224 చ.మీటర్ల విస్తీర్ణంలో జీ ప్లస్ 1 ఉండే విధంగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మీడియా పాయింట్, డైనింగ్ రూమ్, కిచెన్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా మొదటి అంతస్తులో 16 చాంబర్లు, వెయిటింగ్ హాల్, సర్వర్ రూం ఏర్పాటుచేశారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి మంత్రి నారాయణ తెలుసుకున్నారు. వచ్చే సోమవారం నాటికి భవనం అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రికి సీఆర్డీఏ అధికారులు తెలియజేసారు. మంత్రి నారాయణ వెంట అసెంబ్లీ కార్యదర్శి సూర్యదేవర ప్రసన్న కుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండాలి

**- వర్షాలపై సమీక్షలో మంత్రి గొట్టిపాటి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అధికారులతో సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, ఈదురుగాలులతో కూలిన కరెంటు స్తంభాల పునరుద్ధరణ వెంటనే చేపట్టాలన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి తనకు నివేదించాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

## ఏపీ పర్యాటకాభివృద్ధికి కేంద్రం హామీ

- ఢిల్లీ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- కేంద్ర పర్యాటక మంత్రి, అధికారులతో భేటీ
- మూడు పర్యాటక ప్రాజెక్టులకు డీపీఆర్‌లు
- ఆయా ప్రతిపాదనలకు సానుకూల స్పందన



న్యూఢిల్లీ : ఏపీ పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి విజయవాడ నుంచి న్యూఢిల్లీ బయలుదేరిన మంత్రి కందుల దుర్గేష్ సోమవా రం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర పర్యాటక అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రం లో పర్యాటకాభివృద్ధి, పలు ప్రాజెక్టులకు అనుమతులపై సానుకూ లంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ అభివృద్ధికి సంబంధించి దాదాపు రూ.270 కోట్ల విలువైన మూడు పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్‌లు సమర్పించారు. ప్రధానంగా లేపాక్షిలో కల్చరల్ సెంటర్, పర్యాటకుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.103 కోట్లు, లంబసింగిలో పర్యాటకులకు ఆహ్లాదకరమైన, అద్భుతమైన అనుభవాల కల్పనకు రూ. 99.87 కోట్లు, బుద్ధిస్ట్ సర్క్యూట్ సమీపంలో టెంట్ సిటీల ఏర్పా టుకు రూ.77.32 కోట్లు అవసరమవుతాయని సంబంధిత డీపీ ఆర్‌లను కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మంత్రి కందుల దుర్గేష్ సమర్పించారు. అదేవిధంగా ప్రపంచ స్థాయి హోదా కల్పనలో భాగంగా యునెస్కో జాబితాలో లేపాక్షికి గుర్తింపు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. లలిత కళలను ప్రోత్సహించేందుకు, యువ కళాకారులకు మద్దతుగా విశాఖపట్నంలో లలిత కళా అకా డమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని అభ్య ర్థించినట్లు తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేసేందుకు విజయవాడలోని జీవీఆర్ మ్యూజిక్, డ్యాన్స్ కాలేజీలో కళాక్షేత్ర ఆడిటోరియం నిర్మాణం, రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తెలుగు భాష, సాహిత్యాన్ని, సంగీత, నృత్య, నాటక కళలను సంరక్షించేం దుకు, ప్రోత్సహించేందుకు, రచయితలకు అవకాశాలు కల్పించేం దుకు సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయా లని కోరినట్లు వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచ‌నల మేరకు సూర్యరాయ ఆంధ్ర నిఘంటువును పునర్ముద్రించా లని, భవిష్యత్ తరాలకు అందజేయాల్సిన అవసరాన్ని వివరించా నని తెలిపారు. అదేవిధంగా సింగపూర్ విజిటర్ సెంటర్, దుబా య్ టూరిజం హబ్‌ల మాదిరిగా రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాలు, సందర్శకుల సౌకర్యాలు మరింత బలోపేతం చేసేందు కు, అంతర్జాతీయ పర్యాటక డెస్క్‌లు, ప్రధాన పర్యాటక అగ్రిగేట ర్లకు స్థలాలు, వీసా ఫెసిలిటేషన్ కౌంటర్లు ఏర్పాటు కోసం రూ. 100 కోట్లతో అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియన్స్, ఇంటర్ ప్రెటేషన్, ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఏపీటీఐఎఫ్‌సీ) ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై అమరావతిలో 5 ఎకరాల భూమికి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రికి వివరించినట్లు చెప్పారు. పై అభ్యర్థనలకు త్వరితగతిన నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. భేటీలో భాగంగా రాజ మహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, అమరావతిలో పర్యాటక భవన్ అంశం చర్చకు వచ్చిందని వెల్లడించారు. అదే విధంగా గతంలో సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

## నర్సింగ్ చదివిన ఎస్సీ, ఎస్టీ యువతులకు..

# జర్మనీ భాషలో ఉచిత శిక్షణ




- అనంతరం జర్మనీలో ఉద్యోగ అవకాశాలు
- మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- విశాఖలో శిక్షణ తరగతులు ప్రారంభించిన మంత్రి

విశాఖపట్నం(చైతన్యరథం): రాష్ట్రంలో నర్సింగ్ విద్యను అభ్యసించే విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని, దానిలో భాగం గానే జర్మనీలో లక్షల వేతనంతో కూడిన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుం దని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొ న్నారు. స్థానికంగా విద్యను అభ్యసించిన విద్యార్థులను, ఇప్పటికే ఆ రంగంలో చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తున్న వారిని గుర్తించి ఉచిత శిక్షణ అందించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఒప్పం దం చేసుకుందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలో తొలిదశలో గుర్తించిన 29మంది విద్యార్థులకు నిర్దేశించిన శిక్షణ తరగతులను చినగదిలి మండలం పరదేశీ పాలెం బాలికల కళాశాల వసతి గృహం లో సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం - స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసక్తి గల విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తుందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 75 మందికి జర్మనీ వెళ్లేందుకు అవకాశం ఉందని, ప్రాథమికంగా ముందుకు వచ్చిన 29 మందికి శిక్షణ అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారని పేర్కొన్నా రు. మిగిలిన విద్యార్థులు కూడా ముందు కు రావాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థు లకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించే దిశగా కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. ప్రపంచ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందేందు కు అందరూ ముందుకు రావాలని సూచించారు. ఆంధ్రా బ్రాండ్‌ను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు విద్యార్థులు కష్టపడా లని, బాగా రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే గుంటూరులో కూడా కొంత మందిని గుర్తించామని, మలి దశలో తిరుపతి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పలువురిని గుర్తిస్తామని, 200 నుంచి 300 మంది వరకు ఒక గ్రూప్‌గా జర్మనీ పంపిస్తామని మంత్రి చెప్పారు. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటా మని, మెరుగైన జీవనోపాధి అందించే దుకు కృషిచేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఇలాంటి శిక్షణ అందించటం ఒక మంచి ముందడుగు అని మంత్రి అభివర్ణించారు. శిక్షణ తీసుకునే వారికి, పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి వీసా తీసుకొచ్చేందుకు, ప్రయాణ ఛార్జీలు అందించేందుకు చర్య లు తీసుకుంటామని పేర్కొన్నారు. వెనకడుగు వేయకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ప్రపంచ స్థాయిలో మన సత్తాను చాటేందుకు ధైర్యం చూపా లని విద్యార్థులకు మంత్రి డా.స్వామి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంఘికసంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఈడి అగస్టిన్, ఎండీ గణేష్‌లు పాల్గొన్నారు.

## 29న ప్రతిష్టాత్మకంగా నేషనల్ స్పోర్ట్స్ డే




- క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు
- తిరుపతిలో జోనల్‌స్థాయి పోటీల ప్రారంభం

తిరుపతి(చైతన్యరథం): గత ప్రభుత్వానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఈనెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని తారక రామ స్టేడియంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సింహా యాదవ్, ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వ లన చేశారు. ఎనిమిది జిల్లాల నుంచి 1700 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ఈనెల 29న నేషనల్ స్పోర్ట్స్ డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్పోర్ట్స్ డే వేడుకలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకా లు అందజేస్తామన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ క్రీడా కారులను గౌరవించాలనే ఉద్దేశంతోనే నేషనల్ స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహి స్తున్నామన్నారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్రస్థాయిపోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారుల జీవిత భద్రతకు రాత పరీక్ష లేకుండా 3 శాతం రిజర్వేషన్‌తో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. క్రీడాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి విశేషమైనదన్నారు. స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రతీ పాఠశాలకు రూ.30 వేలు నిధులను కేటాయించి క్రీడా సామగ్రిని అందజేస్తున్నారని వివరిం చారు. పాఠశాలల్లో క్రీడా స్థలాల అభివృద్ధికి పంచాయతీరాజ్ ద్వారా 10 శాతం నిధులను కేటాయిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని, దానికి అనుగుణంగా కృషి చేస్తున్నారని వివరిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణయ్య డ్రగ్స్ నిర్మూలనపై క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ రజనీ, డీఎస్డీఓలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలపైనే ఫిర్యాదు



- ప్రజావినతులకు తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన దేవినేని ఉమ

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజావినతులకు అర్జీదారులు పోటెత్తారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ అర్జీలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా పెద్దచె ర్లోపల్లి మండలం మలినేనివారిపల్లె గ్రామానికి చెందిన మలినేని మాల కొండయ్య సమస్యను వివరిస్తూ తమ పెద్దల నుంచి వచ్చిన వారస త్వ భూమిని తమ పేర్లపై ఆన్‌లైన్ చేయాలని వినతిపత్రం ఇచ్చారు.

### భూమి తిరిగివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు

విజయనగరం జిల్లా లక్కవరపుకోట గ్రామానికి చెందిన సంగం వెంకటరమణ సమస్యను వివరిస్తూ 2008లో మల్లివీడు గ్రామంలో 5.55 సెంట్ల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. డబ్బు సరిపడాలేనందున విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన మేడపాటి రామలింగారెడ్డి, జగన్మోహనరెడ్డి వద్ద రూ.35 లక్షలు అప్పు తీసుకున్నట్లు చెప్పారు. అప్పు ఇచ్చే సమయంలో ఆ భూమిని జనరల్ పవర్ ఆఫ్ ఆటార్నీ రూపంలో వారి పేరున రిజిస్టర్ చేయించుకున్నారని వివరించాడు. అప్పు, వడ్డీ చెల్లించిన తర్వాత భూమి తిరిగి ఇస్తామని హామీ ఇచ్చినా భూమిని స్వాధీనం చేసుకు నే ప్రయత్నం చేశారు. 2009లో వడ్డీ సరిగా చెల్లించడం లేదనే నెపంతో మరిన్ని భూములను కూడా జనరల్ పవర్ ఆఫ్ ఆటార్నీ ద్వారా తమ పేరున రిజిస్టర్ చేయించుకున్నారని ఫిర్యాదు చేశారు. 2016లో అప్పు తీర్చడానికి సిద్ధమని చెప్పినా భూమిని తిరిగి ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ తమ పేరున ఉంది కాబట్టి భూమి మాదే అంటూ మోసం చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### నాడు భూమి ఇచ్చారు..నేడు లేదంటున్నారు

తాను మిలటరీలో 35సంవత్సరాలు కుక్‌గా పనిచేసి 2002లో రిటైర్డ్ కాగా ప్రభుత్వం లింగసముద్రం మండలంలోని రాచెరు వురాజుపాలెం రెవెన్యూ గ్రామంలో స్థలం ఇచ్చారని పొట్టి శ్రీరాము లు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం మొగిచర్ల గ్రామానికి చెందిన చీమలదిన్నె కొండయ్య వివరించారు. ఇప్పుడు తమకు అక్కడ స్థలం లేదని చెబుతున్నా రని, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### రుణం తీసుకోకపోయినా కట్టమంటున్నారు

తమ గ్రామంలో డ్వాక్రా గ్రూపులో చేరడానికి భూలక్ష్మి అనే మహిళకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ ఇచ్చానని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వెంగాళాయి పాలెం గ్రామానికి చెందిన దుద్యాలి సత్యవతి తెలిపింది. తమ భర్త డ్వాక్రా వద్దని చెప్పడంతో వాటిని తిరిగి తీసుకున్నట్లు వివరించింది. అయితే ఫోటో ఇవ్వలేదని చెప్పింది. మూడేళ్ల తర్వాత జీడీసీసీ బ్యాంకు వారు లోను డబ్బులు కట్టాలని ఇంటికి వచ్చినట్లు వివ రించింది. తాము రుణం తీసుకోలేదని చెప్పినా తమ పేరుతో రుణ బకాయిలు ఉన్నాయని చెబుతున్నారని.. తమ సమస్యను పరిష్కరిం చాలని అభ్యర్థించారు.

### బినామీతో పట్టా మార్పించుకున్నారు..

తన తండ్రి కంగల వెంకటేశ్వర్లుకు దేవరపల్లిలో 10.68 ఎకరాల భూమి ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడు మిల్లి మండలం సున్నంపాడు గ్రామానికి చెందిన బట్టా రాజేశ్వరి తెలిపింది. సర్వే నెంబర్ 69/1లో ఒక ఎకరం భూమిని తమ ప్రమేయం లేకుండా అక్కిసబాలు అనే వ్యక్తి బినామీలతో అక్రమం గా పట్టా మార్పించుకున్నట్లు ఫిర్యాదు చేసింది. ఈ సమస్యపై గత ఐదేళ్లుగా పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా చర్యలు తీసు కోలేదని వివరించింది. పైగా తమపై తప్పుడు కేసులు పెట్టి వేధి స్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసింది.

## అంటు వ్యాధులకు ముందస్తు చర్యలు

- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- వైద్య మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

అమరావతి(చైతన్యరథం): భారీవర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలను త్వరితగతిన తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశిం చారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాల్లోని తాజా పరిస్థితులపై అధికారులు మంత్రికి సోమవారం వివరించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ఇతర శాఖలతో కలిసి సమన్వయంతో పని చేస్తున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వచ్చేనెల వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అంటు రోగాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అలసత్వానికి తావివ్వొద్దని సూచించారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన సమ స్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మండలాల వారీగా కేసుల నమోదు తీరుపై సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూసినట్లయితే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్నారు. గ్రామాల్లో పని చేసే సీహెచ్ఓలు, జిల్లా అధికారులు నిర్దేశించిన సమయాల్లో తాగునీటి నమూనాలు, సేకరించి పరీక్షలు చేయడానికి అధిక ప్రాధాన్య త ఇవ్వాలని తెలిపారు. నీటి ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మున్సిపల్, పంచాయతీ, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ అవసర మైన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా వైద్యులు సూచించిన మేరకు ప్రసవ తేదీల ఆధారంగా గర్భిణుల వివరాలు సేకరించి వారికి వైద్యసేవలు సకాలంలో అందడంలో ఎటువంటి అవరోధం రాకుండా చూడాలని సూచించారు. ఇందుకు ఆశా, ఏఎన్ఎంల సహకారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు అవసరాలకు అనుగు ణంగా వాడుకునేందుకు అంబులెన్సులను మ్యాపింగ్ చేసినట్లు వెల్లడించారు.

# పర్యాటకంగా కైలాసగిరి మరింత అభివృద్ధి

●సందర్శకులను అలరించేలా బీచ్ రోడ్ లో హెలీ మ్యూజియం

●కైలాసగిరి పై త్రిశూలం ప్రాజెక్ట్ కు శంకుస్థాపన

●పాల్గొన్న ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయు స్వామి, హోం మంత్రి అనిత



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఆకర్షణీయమైన ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని, ఇందులో భాగంగా పర్యాటక ప్రాంతం కైలాసగిరిని మరింత అభివృద్ధి చేస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, హోం శాఖ మంత్రి అనిత, వీఎంఆర్డీ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్ అన్నారు. సోమవారం సాయంత్రం కైలాసగిరిపై నూతనంగా చేపట్టబోతున్న త్రిశూలం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పైలాన్‌ను ప్రారంభించి, త్రిశూలం నమూనాను ప్రదర్శించారు. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... విశాఖకు వచ్చే సందర్శకులను ఆకట్టుకునే విధంగా కైలాసగిరిపై రూ. 1.55 కోట్లతో సుమారు 55 అడుగులతో దమరుకంతో కూడిన త్రిశూలం ఏర్పాటు చేస్తున్నామని, నగరం నుంచి చూస్తే అందరికీ కనిపించే విధంగా హనుమంతవాక వైపు ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు. అతి త్వరలోనే దేశంలోని అతి పెద్ద గ్లాస్ బ్రిడ్జిను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసి, విశాఖ వచ్చే సందర్శకులకు, పర్యాటకులను ఆకర్షించే విధంగా పలు ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బీచ్ రోడ్‌లో సుమారు రూ. 3.50 కోట్ల రూపాయల నిధులతో నెలకొల్పిన హెలికాప్టర్ మ్యూజియంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, సుధీర్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో జోరుగా వర్షాలు... పాడేరులో 16.1 సెం.మీ వర్షపాతం

● ఉభయగోదావరి జిల్లాలోని తొండంగి మండలంలో అత్యధికంగా 55.2 మి.మీ



విశాఖపట్నం (చైతన్యరథం): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అత్యధికంగా 16.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో 15.5 సెం.మీ., మాడుగుల, కె.కోటపాడులో 15 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. అల్పపీడన ప్రభావంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విస్తారంగా వర్షం కురుస్తోంది. విజయనగరం జిల్లాలో గత ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో అధిక వర్షపాతం నమోదైంది. వంగర, మెరకముడిదాం, దత్తిరాజేరు, గజపతినగరం, గుర్ల మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. బాడంగి, వేపాడ, లక్కవరపు కోట, కొత్తవలస, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. భోగాపురం విమానాశ్రయ నిర్మిత ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల నుంచి వర్షపునీరు రావడంతో కూడెం, చినకొలువాడ, పెదకొలువాడ, బైరెడ్డిపాలెం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

విశాఖ ఫిషింగ్ హార్బర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఒడరేవు ప్రాంతమంతా వర్షం నీరు నిండి.. చేపల వ్యాపారులు, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి, అనంతవరం, తదితర ప్రాంతాల్లో వర్షాలకు వరినాట్లు నీట మునిగాయి. రెండు వారాల క్రితమే నాట్లు వేశామని రైతులు చెబుతున్నారు. పొలాల పైనుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది. మరికొందరు నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు.

ఉభయగోదావరి జిల్లాల్లోనూ వర్షం విస్తారంగా కురుస్తోంది. తొండంగి మండలంలో అత్యధికంగా 55.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గొల్లప్రోలు మండలంలోని సుద్దగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేసుకోగా.. అది నీట మునగడంతో కొత్త వంతెనపై ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు.

# వీడియో కాల్‌పై అబద్ధపు ఆరోపణలు : కూన రవి కుమార్

ఆముదాలవలస (చైతన్యరథం): పొందూరు కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే తనపై ప్రిన్సిపల్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆముదాలవలస ఎమ్మెల్యే, టీడీపీ నేత కూన రవికుమార్ స్పష్టం చేశారు. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపల్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. అయితే పొందూరు ఎమ్మెల్యే కూన రవికుమార్ తనను వేధిస్తున్నారంటూ పాఠశాల ప్రిన్సిపల్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందించారు. ఆ క్రమంలో ఆదివారం అమరావతిలోని టీడీపీ నేతలతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థినుల అడ్మిషన్లకు అక్రమంగా నగదు వసూలు చేయడం, వారికి ఉపయోగించాల్సిన నిత్యావసర వస్తువులను దారి మళ్లించడం వంటి అంశాలపై ఆమెను ప్రశ్నించానని చెప్పారు.

ఆ క్రమంలోనే వైసీపీ నేతలతో కలిసి ప్రిన్సిపల్ తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. "తల్లికి వందనం" కార్యక్రమంపై ముగ్గురు ప్రిన్సిపల్స్‌తో ఒకే సారి తాను వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కానీ కేవలం పొందూరు కేజీబీవీ ప్రిన్సిపల్‌తోనే వీడియో కాల్ చేసినట్లు అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ విద్యార్థినులతో ఇంట్లో పనులు చేయించుకోవడం.. మెగా టీచర్ – పేరెంట్ మీటింగ్ కోసం విద్యార్థినుల నుండి అక్రమంగా నగదు వసూలు చేస్తోందంటూ సదరు ప్రిన్సిపల్‌పై తల్లిదండ్రుల నుంచి తనకు ఫిర్యాదులు అందాయన్నారు. ఆ క్రమంలో ఈ ఫిర్యాదులు ఆధారంగా మాత్రమే ఆమెను తాను ప్రశ్నించానని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి గతంలో ఆమె సస్పెండ్ అయిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# టీడీపీ కార్యాలయాన్ని పునః ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం వైకేయం కాలనీలో సుందరంగా తీర్చిదిద్దిన టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పున ప్రారంభించారు. గతంలో నిర్మించిన కార్యాలయానికి నూతనంగా ద్వార బంధాలు, తలుపులు అమర్చి అందంగా తయారు చేశారు. ఈ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే విజయ్ చంద్ర దంపతులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగువీర మహిళలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఎమ్మెల్యే సతీమణి తాంబూలాలు ఇచ్చి సత్కరించారు. అలాగే టీడీపీ నాయకులు కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం

● గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని కేంద్రీకృతమైంది. ఇది పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ ఇవాళ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం మధ్యాహ్ననికి దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రాబోయే రెండు మూడు రోజుల్లో కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ విజ్ఞప్తి చేశారు. అల్పపీడన ప్రభావంపై హోంమంత్రి సమీక్ష: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితి తీవ్రత బట్టి ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్డీఆర్ఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ తగినన్ని బృందాలను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ, ముందస్తు హెచ్చరికల ఆధారంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని హోంమంత్రి సూచించారు.

# భారీ వర్షాలపై విజయనగరం కలెక్టర్ సమీక్ష

విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులపై సోమవారం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారులు, మండలాధికారులు గ్రామాల్లో పర్యటించాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులపై వెంటనే నివేదిక సమర్పించాలని తెలిపారు. నీటి పారుదల కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# నేడు వినుకొండ మార్కెట్ యార్డు వేదికగా మెగా కిసాన్ మేళా: చీఫ్ విప్ జీవీ

**●సాగు సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యం**



వినుకొండ (చైతన్యరథం): సాగు రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వేదికగా మంగళవారం మెగా కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. వసాయ రంగంలో నూతన పద్ధతులు, యాంత్రీకరణ ప్రాధాన్యం తెలియజెప్పేలా ఈ సరికొత్త వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాగు, రైతుల సమస్యలకు సంబంధించిన వివిధ అంశాల్లో నిపుణులైన శాస్త్రవేత్తల్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చి పరిష్కారాలు చూపిస్తామన్నారు. సోమవారం ఈ మేరకు వీడియో విడుదల చేసిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధునిక వ్యవసాయం, రైతుల ఆర్థిక ప్రగతి ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, వారి తలసరి ఆదాయం పెంచడం, అప్పు తీర్చి ఆనందంగా ఉంచాలన్నదే తన ఆలోచనని తెలిపారు. మెగా కిసాన్ మేళాకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సీనియర్ శాస్త్రవేత్తలు హాజరవుతున్నారని, వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు, పండ్ల తోటల పెంపకంలో మెళుకువలు, ఆధునిక యంత్రాలు, సాగుపద్ధతులు, కొత్త వంగడాలు, అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు తెలియజేస్తారన్నారు. సస్య రక్షణ, వ్యవసాయ అనుబంధ రంగాలైన డెయిరీ, ఫౌల్ట్రీ, మత్స్యకారుల, గొర్రెల పెంపకం, నేత, గీత కార్మికులకు ఆయా రంగాల్లో అధిక లాభాలు సాధించడం ఎలా అనే అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రకృతి వ్యవసాయం, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ, బిందుసేద్యం, ఉద్యాన తదితర శాఖలు, వివిధ రకాల ఆధునిక యంత్రాలు, రైతులకు అవసరమైన పరికరాలు, ఎరువులు, బ్యాంక్ సేవలు, డ్రోన్లకు సంబంధించి 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. డ్రోన్, ట్రాక్టర్ స్ప్రేయర్లతో మందుల పిచికారీపై అవగాహన కల్పించడమే కాక రైతుల సందేహాలు శాస్త్రవేత్తలు నివృత్తి చేస్తారని చెప్పారు. వేలాది మంది రైతు సోదరులు తరలివచ్చి మెగా కిసాన్ మేళాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు.

# ట్రాఫిక్ డైవర్షన్ ప్రాంతాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): నగరంలో శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ చేసిన క్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్విచక్రవాహనంపై స్వయంగా ప్రయాణిస్తూ పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, కోరిటిపాడు, బ్రాడిపేట, శ్యామల నగర్ రైల్వే గేట్, కంకరగుంట ఆర్‌యూబి, జేకేసి కాలేజీ రోడ్డు, ఐటీసీ వంటి ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. ట్రాఫిక్ డైవర్షన్ అమలులో ఉన్న విధానాన్ని గమనించి స్థానికులతో కూడా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పశ్చిమ ట్రాఫిక్ సిఐ సింగయ్యకు సూచించారు. ముఖ్యమైన రోడ్డు జంక్షన్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు, వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. పనులు పూర్తయిన తర్వాత గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు ప్రజలు కొంత సహనం పాటించి, సహకరించాలని కోరుతున్నాను. ప్రజలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులను నిరంతరం మానిటరింగ్ చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా ఇచ్చారు.

# రాజనీతిజ్ఞుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్



ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్ ను రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్‌తో కలిసి సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు మంత్రి నారా లోకేష్ తో పాటు సీపీ రాధా కృష్ణన్ కు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు.కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ సహచర ఎంపీలు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నియోజకవర్గంలోని శ్మశాన వాటికలకు కొత్త రూపు

**●ఎనిమిది శ్మశానవాటికలను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేయించిన మంత్రి నారా లోకేష్**



తాడేపల్లి (చైతన్యరథం): మంగళగిరి నియోజకవర్గంలో ఒకప్పుడు చెట్లు, పుట్టల మధ్య దర్శనమిచ్చే శ్మశాన వాటికలు ఇప్పుడు కొత్తరూపును సంతరించుకుంటున్నాయి. మంత్రి నారా లోకేష్ కృషితో నియోజకవర్గంలోని అన్ని సామాజికవర్గాల శ్మశానవాటికల రూపురేఖలు మారుతున్నాయి. మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరం గ్రామంలో ఉన్న ఎనిమిది శ్మశాన వాటికలను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేయించారు. ఆ అభివృద్ధి పనులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ఉన్న అన్ని శ్మశాన వాటికలకు చుట్టూర ప్రహరీ గోడలు లేకపోవడంతో పాటు ఇతర సమస్యను గ్రామస్తులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన త్వరితగతన సొంత నిధులతో అభివృద్ధి పనులను చేయించారు. ప్రత్యేక నిర్మాణాలతో కూడిన చితులు, వెయిటింగ్ హాళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి సదుపాయాలతో అభివృద్ధి పనులు చేయించారు. కేశ ఖండనం, దుస్తులు మార్చుకునేందుకూ గదులతో పాటు బూడిద నిల్వ సౌకర్యం వంటివి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనితో గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో వడ్డేశ్వరంలో గ్రామంలో హిందూ, ముస్లిం, మాదిగ, మాల, గౌడ, రజక, కన్వెర్టడ్, యాదవ-మరాఠి, సామాజికవర్గాల శ్మశాన వాటికలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అన్ని మతాలకు చెందిన శ్మశానవాటికలను మంత్రి నారా లోకేష్ దశల వారీగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చేస్తున్న అభివృద్ధి దేశంలోని ఏ నియోజకవర్గంలో కూడా చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఈపూరి బాబు, నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు, ఎర్రగుంట్ల భాగ్య రావు, మల్లవరపు వెంకట్, షేక్ రియాజ్, వేమూరి మైనర్ బాబు, ఎండీ ఇబ్రహీం, కొల్లి శేషు, దాసరి కృష్ణ, కాంట్రాక్టర్ వెలగపూడి కిషోర్ బాబు, బొర్రా కృష్ణ వందన, షేక్ అక్రమ్, ఎస్.కె ఇబ్రహీం, యలమంచిలి పద్మజ, మద్దినేని సుబ్రహ్మణ్యం, జోరుగా దాసు, గుంపెన నాగేశ్వరరావు, షేక్ ఇమాంస, అంజుమన్, కమిటీ పెద్దలు, క్రిస్టియన్ పాస్టర్లు, గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# పేదల పాలిట సంజీవనిగా సీఎంఆర్ఎఫ్ పథకం

**● వేమూరు నియోజకవర్గంలో రూ.3.58 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట సంజీవనిగా మారిందని నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. సోమవారం కొల్లూరు మండలం, కొల్లూరు గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.3.58 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారికి ఈ సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేలాది కోట్ల రూపాయాలు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేయడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధులు రాక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దోచుకోవడమే లక్ష్యంగా ఐదేళ్ల పాలన సాగిందన్నారు. నాటి వైసీపీ పాపాలు ఇప్పుడు బయటపడుతున్నాయని, వైసీపీ అవినీతిని కక్కించి జైలుకు పంపిస్తామన్నారు.

# వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుపై టీడీపీ నేత ఫిర్యాదు

గుంటూరు (చైతన్యరథం): వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుపై గుంటూరు ఎస్పీకి గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో హరిబాబు మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓట్లు రిగ్గింగ్ చేశారంటూ అంబటి రాంబాబు తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదు చేశారు. మార్ఫింగ్ వీడియోలను పోస్ట్ చేసిన అంబటిపై చర్యలు తీసుకొవాలని విజ్ఞప్తి చేశారు హరిబాబు. పశ్చిమ బెంగాల్‌లో 2023లో జరిగిన ఎన్నికల వీడియోను మార్ఫింగ్ చేసి ట్రోల్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఫైర్ అయ్యారు. 2024లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా జగన్మోహన్‌రెడ్డి అండ్ బ్యాచ్ మారకపోవడం దారుణమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ వీడియోలు పెట్టి టీడీపీపై బురద జల్లారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో అంబటి రాంబాబు జైలుకు వెళ్లడం ఖాయం.

# ప్రజారాజధాని అమరావతిపై వైసీపీ తప్పుడు ప్రచారం

**●ఏపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్**



గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి వంటి పథకాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సోమవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో చైర్మన్ ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో జగన్ పాత్రపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్ళించేందుకు తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆగస్టు 11 నుంచి వారం రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి.సుమారు 16 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. రికార్డు స్థాయిలో సీఆర్డీయే పరిసర ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనప్పటికీ ఎక్కడా ఏ కార్యాలయమైనా మునిగిపోయిందా? అని ప్రశ్నించారు. సచివాలయానికి వెళ్లే మార్గంలో ఎక్కడా చుక్క నీరు నిల్వలేదన్నారు. హైకోర్టు గానీ, విద్యా సంస్థలు గానీ, ప్రభుత్వ కార్యాలయాలు గానీ ఏ ఒక్క దాని కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకాలు కలగలేదన్నారు. ఇబ్బందల్లా వైసీపీ మీడియా అయిన సాక్షి, దాని అనుబంధ సంస్థలకే అని ఎద్దేవాచేశారు. కొండవీటివాగు నీటిని పొన్నూరు, ఇతర ప్రాంతాలకు తరలించి లక్షల ఎకరాల పంట పొలాలను ముంచారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



### సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, (చైతన్యరథం): తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వేడుక ఏర్పాట్లు, నిర్వహణ, సదుపాయాలపై తితిదే ఈవో జె శ్యామలరావు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ శ్రీహర్షవర్ధన్ రాజు, అధికారులు సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య భవనంలో జరిగిన సమావేశంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ముఖ్యాంశాలను తితిదే వెల్లడించింది. సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలి రోజు రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపింది. సెప్టెంబర్ 28న గరుడ సేవ, అక్టోబర్ 2న చక్రస్నానం ఉంటుందని పేర్కొంది. రద్దీని ముందుగా అంచనా వేసి జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఈవో శ్యామలరావు ఆదేశించారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహనాల రాకపోకలను అంచనా వేసేందుకు టెక్నాలజీ సాయం తీసుకోవాలన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయం, గ్యాలరీలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసులతో భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని, తిరుమలలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు.



# ప్రజల ఆరోగ్యానికే అత్యంత ప్రాధాన్యం

### దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): దర్శి నియోజకవర్గంలోని 85 మంది పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు మొత్తం 50,42,669 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ప్రతి అనారోగ్య బాధితుడికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా, నియోజకవర్గం టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు ఉన్నారు.

# ఎట్టకేలకు చిక్కిన చిరుతపులి



తిరుపతి, (చైతన్యరథం): మూడు బోన్లు ఏర్పాటు చేసినా నెల రోజులుగా తప్పించుకు తిరుగుతున్న చిరుత ఎట్టకేలకు చిక్కింది. ఎస్వీయూ క్యాంపస్లో లోని ఏడీ బిల్డింగ్ వెనుక ఫారెస్ట్ అధికారులు ఉంచిన బోనులో చిక్కింది. వర్సిటీ క్యాంపస్లో లోని కుక్కలు, జింకలపై దాడి చేసి చంపేస్తుండటంతో. యూనివర్సిటీ సిబ్బంది ఆటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో నెల రోజుల క్రితమే వర్సిటీలోని పలు చోట్ల బోన్లు ఏర్పాటు చేసిన అధికారులు తాజాగా బంధించారు.

# శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద ప్రవాహం

సున్నిపెంట, (చైతన్యరథం): శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీంతో మరో రెండు గేట్లు ఎత్తారు. మొత్తం ఐదు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్టుకు 2,30,876 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో 2,29,129 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,784 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఐదు గేట్ల ద్వారా 1,33,030 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881,80 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.91 టీఎంసీలుగా కొనసాగుతోంది.



# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు జాగ్రత్తలు



### ఉన్నతాధికారులతో కలెకర్టర్ చర్చలు

నెల్లూరు, (చైతన్యరథం): ధాన్యం సేకరణకు పౌరసరఫరాలశాఖ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసింది. కేంద్రం అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభించనుంది. అదే సమయంలో సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు ఉండగా.. రైతుల అవసరాలు, వ్యాపారుల విక్రయాలు పోను.. మూడు లక్షల టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంటుంది. ఆకస్మిక వర్షాలతో కొనుగోళ్లలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండటంతో సేకరణ కేంద్రాలు కీలకమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గాల్లో అత్యధికంగా, కావలి, ఉదయగిరి ప్రాంతాల్లో మోస్తరుగా ఎడగారు ఉంది. ఈ ప్రాంతాల్లో సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. నాలుగైదు మండలాలను క్లస్టర్లుగా చేసి అవసరాలకు అనుగుణంగా వాటిని బదిలీ చేయనున్నారు. తొలిపంట కాలంలో 300 కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 125 సరిపోతాయని చెబుతున్నారు. ఇప్పటికే అనుభవం ఉన్న నేపథ్యంలో సిబ్బందికి శిక్షణ కూడా అవసరం ఉండదని భావిస్తున్నారు.రబీ సీజన్ లోని ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వానికి బియ్యంగా అందించేందుకు పౌరసరఫరాలశాఖకు సెప్టెంబరు నెలాఖరు వరకు అనుమతి ఉంది. అక్టోబరు నుంచి ఖరీఫ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మాత్రమే ఎడగారు సాగు జరుగుతుంది. దాంతో సాగు ఒక పంట కాలంలో.. దిగుబడి మరో పంట కాలంలో ఉంటుంది. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎర్లీ ఖరీఫ్, లేట్ రబీ పేరుతో ఆన్లైన్లో సేకరణ ప్రక్రియను అనుసంధానం చేస్తేనే.. అడ్డంకులు తొలగుతాయి. గత రెండేళ్లలో ఈ ప్రక్రియ జరగకపోవడం ప్రతిబంధకమయింది. ఈ విషయాలపై పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు అర్జునరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆనంద్, జేసే కార్తీక్ సేకరణ త్వరగా జరిగేందుకు అవసరమైన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి అందించారన్నారు. అనుమతి లభిస్తే కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నామన్నారు.



కందుకూరు, చైతన్యరథం): పట్టణ అభివృద్ధి నిరంతర యజ్ఞంలా సాగుతుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్ల వెడల్పు, డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అంబేద్కర్ విగ్రహం నుంచి వాసవి నగర్ వరకు డబుల్ రోడ్డు, డివైడర్ నిర్మాణం, సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం మూడు రోజుల్లో భూమి పూజ చేయబోతున్నాము. ఏళ్ల క్రితం ఎప్పుడో నిర్మించిన సైడ్ కాలువల స్థానంలో కాంక్రీట్ కాలవలు నిర్మించేందుకు 2 కోట్ల రూపాయల నుడా నిధులు ఖర్చు తెలిపారు.

# ఆ పత్రిక నిండా పిచ్చి రాతలే

### మీడియా సమావేశంలో సాక్షి తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు తెలుగుదేశం కార్యాలయంలో సోమవారం ఉదయం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. అధికార కూటమి ప్రభుత్వంపై సాక్షి మీడియా పిచ్చి రాతలు రాస్తోందన్నారు .అన్నదాత సుఖీభవ పథకం కింద కందుకూరు నియోజకవర్గంలో 31, 850 మంది లబ్ధిదారులు ఉంటే, వారిలో 31 వేల మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 30% మందికి ఈ నిధులు జమ కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని సంక్షేమ పథకాలలో 99 శాతం మంది అర్హులకు నిధులు జమ జరిగిందన్నారు. ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు వచ్చినప్పుడు, 50 కోట్లు కందుకూరు పట్టణ అభివృద్ధికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 7 కోట్ల రూపాయలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. మరో 5 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ఆ నిధులు కూడా త్వరలో మంజూరవుతాయన్నారు. గెలిచిన తొలి ఏడాదిలోనే సుమారు 10 కోట్ల రూపాయలపైగా అభివృద్ధి పనులు చేశామంటే, అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. కానీ ఇవన్నీ దాచిపెట్టి సాక్షి పత్రికలో అబద్ధాలు రాస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి సంవత్సరంలోనే ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయడం ఒక రికార్డు అన్నారు. తాజాగా 86 మంది లబ్ధిదారులకు 85.5 లక్షలు మంజూరు చేశారన్నారు. వలేటివారిపాలెం మండలం కలవల్ల గ్రామానికి చెందిన అబ్బూరి పుల్లయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోయాడన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యధికంగా 10.5 లక్షల రూపాయలు విడుదలయ్యాయన్నారు. గుడ్లూరు మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు 14.40 లక్ష రూపాయలు, కందుకూరు మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు 12.39 లక్ష రూపాయలు, కందుకూరు పట్టణానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు 17.54 లక్ష రూపాయలు లింగసముద్రం మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు 7.28 లక్ష రూపాయలు ఉలవపాడు మండలానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు 6.75 లక్షల రూపాయలు, వలేటివారిపాలెం మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు 16.35 లక్షల రూపాయలను నియోజకవర్గం లోని 4 లబ్ధిదారులకు లెటర్ ఆఫ్ క్రెడిట్ 10.25 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. కందుకూరు పట్టణంలో ఇళ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు లక్ష టన్నుల చెత్త ఇక్కడ పేరుకుపోయి ఉందని, ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు ఆ చెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియను మొదలుపెట్టామన్నారు. నాలుగు నెలల లోపే ఇక్కడ చెత్తనంతా రీసైక్లింగ్ చేసి, డంపింగ్ యార్డ్ స్థలాన్ని అందంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుసారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి కృషి చేయండి



## మార్కెట్ కమిటీ, పీఏసీఎస్‌ల అధ్యక్షులకు మంత్రి సవిత పిలుపు

పెనుకొండ, (చైతన్యరథం): కొత్తగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్‌లు డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్‌పర్సన్‌లు బాధ్యతగా పనిచేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. పెనుకొండ నియోజకవర్గం పెనుకొండ మండలంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా నియమింపబడిన పెనుకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామకృష్ణప్ప, గోరంట్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శైలజా వెంకటేష్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సింగిల్ విండో చైర్మన్లు మంత్రి సవితమ్మ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేయాలని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి నాయకుడికీ కార్యకర్తకు న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప, నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మాట నిలబెట్టుకున్న పరిటాల

## రూ. లక్ష 30 వేల సాయం అందజేసిన తల్లీ కొడుకులు

రాప్తాడు, (చైతన్యరథం): రామగిరి మండలం, కేజీ కుంట గ్రామానికి చెందిన బైనేని నారాయణప్ప అనారోగ్యానికి గురై ఎడమ కాలు తీసివేయగా 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు కృత్రిమ కాలు సమకూర్చుతామని పరిటాల కుటుంబం హామీ ఇచ్చింది. దీనితోపాటు రాప్తాడు మండలం, బండమీదపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు పరిటాల శ్రీరామ్ బండమీదపల్లి గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ పంచాయతీ సర్పంచ్ దగ్గుబాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 1లక్ష 30వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

# త్వరలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం

## అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి సవిత

పెనుకొండ, (చైతన్యరథం): సత్యసాయి పెనుకొండ నియోజకవర్గం పెనుకొండ 44 వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్ త్వరలో పూర్తి చేస్తామని మంత్రి సవిత తెలిపారు. అధికారులతో కలసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ నిత్యం రద్దీగా రాకపోకలు ఉండటంతో గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను పలుసార్లు కేంద్ర రవాణా శాఖ మంత్రులు నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ప్రాంతం చాలా రద్దీగా ఉండాలని ప్రతి రోజు వందల సంఖ్యలో పుట్టపర్తి కొత్తచెరువు గోరంట్ల మండలాల నుంచి కియా పరిశ్రమకు వాహనాలు వస్తుంటాయని అదే విధంగా పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ఇతర ప్రాంతాలకు ఈరహదారి మీదుగా వెళ్తారని ఈ విషయమై కేంద్ర రవాణా శాఖ మంత్రులు గడ్కరికి తెలియచేయగా నిధులు



మంజూరు చేశారని వివరించారు. కేంద్రమంత్రికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షం నీటి సమస్య పరిష్కారం

## ఎస్సీ కాలనీలో పర్యటించిన కమిషనర్, టీడీపీ నేత భూపేష్

జమ్మలమడుగు, (చైతన్యరథం): జమ్మలమడుగు మున్సిపాలిటీలో టీడీపీ ఇన్చార్జి భూపేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సోమవారం పర్యటించారు. మున్సిపాలిటీలో పలురోడ్ల నిర్మాణం కోసం ఎస్సీ కాలనీ, దిగువ పట్నం కాలనీలలో వర్షపు నీరు నిలువ ఉందని సమస్యను ప్రజలు భూపేష్ రెడ్డి దృష్టికి తేవడంతో మున్సిపల్ కమిషనర్ ను వెంట పెట్టుకొని ఆ ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీడీపీలోకి భారీగా చేరికలు

## కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

ఆగళి, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా పార్టీలో చేరిన వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి పిలుపునిచ్చారు. అగళి మండలం ఆలూడి, కొమరేపల్లి గ్రామాల నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. దాదాపు 100 కుటుంబాలు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.



# సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




## అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశం

బనగానపల్లె, (చైతన్యరథం): అవుకు సమీపంలోని తిమ్మరాజు రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న బిళ్ళగడ్డ పొలాలకు సంబంధించిన అవుకు, చెర్లోపల్లె గ్రామాల రైతులు కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తీవ్రమైన సాగు నీటి సమస్య కు మంత్రి బీసీ జనార్ధనరెడ్డి చొరవతో పరిష్కారం లభించింది. ఆయా రైతుల పంట పొలాలకు సాగు నీటి సరఫరా సరిగా అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ తిమ్మరాజు చెరువు నీటి సంఘం ప్రతినిధులు ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ నాయక్ రైతులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తక్షణమే రెవెన్యూ అధికారులు, ఎస్సార్‌బీసీ కెనాల్ అధికారులకు సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.. మంత్రి ఆదేశాలతో అధికారులు వెనువెంటనే స్పందించి రైతులకు తాత్కాలిక పరిష్కారం చూపించారు. ఈ నేపథ్యంలో ఈ రోజు మళ్లీ క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన రైతులు తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీంతో మరోసారి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఎస్సార్‌బీసీఅధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అవుకు, చెర్లోపల్లి గ్రామ రైతులు మంత్రి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెర్లోపల్లి, అవుకు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# గరిమేకలపల్లిలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, (చైతన్యరథం): అంబేద్కర్ విగ్రహం ఎక్కడ చూసినా ఒక గంభీరం కనిపిస్తుందని, ఆ గాంభీరం వెనుక ఎంతో విషాదం ఉందని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం గరిమేకలపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణ చౌదరి సహకారంతో గ్రామంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి డప్పులు వాయిస్తూ, టపాసులు పేలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ సందడి చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎంఎస్ రాజు అనేక పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చారన్నారు. తాము చేసిన పోరాటాల్లో భాగమయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవితాన్ని చదివితే.. కష్టాలు ఎలా ఉంటాయి.. ఉన్నత స్థాయికి ఎలా ఎదగాలన్నది తెలుస్తుందన్నారు. అనేక వివక్షలను, అవమానాలను, ఎదురు దెబ్బలను తట్టుకుని ఉన్నత చదువులు చదివి దేశంలోనే ఒక మహోన్నత వ్యక్తిగా ఎదిగారన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ఒక్క డిగ్రీ చేయాలంటే కష్టపడుతున్నామని కానీ ఆ రోజుల్లోనే అనేక అవరోధాలు ఎదుర్కొని 32 డిగ్రీలు చేశారంటే అంబేద్కర్ శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో కుల వివక్ష, మత గొడవలు ఉండేవని.. ఇలాంటి సమయంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి ఒక మార్గదర్శనం చేశారన్నారు. ఇప్పుడు ఇది దేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా మారిందన్నారు. ఆనాడు దళితులను చెరువులో నీరు కూడా తాకనివ్వకుండా అడ్డుకుంటున్న రోజుల్లో అంబేద్కర్ మార్పు చూపించారన్నారు. అదే స్ఫూర్తితో మా స్వగ్రామమైన వెంకటాపురంలో పరిటాల శ్రీరాములు దళితులకు బావిలో నీరు ఇచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. దళితులు మాకు వెన్నంటే ఉండి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. మా కుటుంబం ఎదుగుదల, పోరాటాల్లో దళితుల పాత్ర ఎంతో ఉందన్నారు. మరోవైపు ఎంఎస్ రాజు మాట్లాడుతూ దళితులు గతంలో చేసిన త్యాగాలు, కష్టాల గురించి పరిటాల శ్రీరామ్ గుర్తు పెట్టుకున్నారంటే.. దానికి తామంతా కృతజ్ఞతలు చెప్పాలన్నారు. రాప్తాడు అభివృద్ధి గురించి చెప్పాలంటే పరిటాల అనే 4అక్షరాలు లేకుండా చెప్పలేమన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఎదుగుదల వెనుక పరిటాల కుటుంబం ఉందన్నారు. ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎల్.నారాయణ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారంటే.. ఇక్కడ చైతన్యం, ప్రశ్నించే వారు ఉన్నారని అర్థమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ అంబేద్కర్ విగ్రహం ఒక దిక్సూచిగా ఉంటుందని ఎంఎస్ రాజు అభిప్రాయపడ్డారు.

## తమిళనాడు మంత్రి నివాసంలో ఈడీ సోదాలు

**కొడుకు, కూతురు ఇళ్లలోనూ తనిఖీలు**

తమిళనాడు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డీఎంకే డిప్యూటీ సెక్రటరీ జనరల్ పెరియసామి నివాసంలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనిఖీలు చేసింది. దిండుక్కల్లోని గోవిందపురం దురైనగర్‌లోని మంత్రి గృహంతో పాటు సీలప్పాడిలోని ఆయన కుమారుడు, పళని ఎమ్మెల్యే సెంథిల్ కుమార్, కుమార్తె ఇందిర ఇళ్లు, ఇతర ప్రాంతాల్లోనూ ఈడీ అధికారులు సోదాలు చేశారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు సుమారు 15గంటల పాటు కొనసాగాయి. ఆస్తులు, పెట్టుబడుల పత్రాలు, కంపెనీ బ్యాంకుఖాతాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 2008లో హౌసింగ్ బోర్డు గృహాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని అప్పటి గృహనిర్మాణ శాఖ మంత్రి పెరియసామిపై ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి అన్నాడీఎంకే హయాంలో అవినీతి నిరోధకశాఖ కేసు నమోదుచేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలూ ఆయనపై వచ్చాయి.

## నవీన్ పట్నాయక్‌కు అస్వస్థత

**భువనేశ్వర్ ఆసుపత్రిలో చికిత్స**

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ ఆదివారం సాయంత్రం స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయన భువనేశ్వర్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నారని ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ఆయన ముంబయిలో సర్వైకల్ ఆర్థరైటిస్‌కు శస్త్రచికిత్స చేయించుకున్నారు.

## 2040 నాటికి జాబిల్లిపై త్రివర్ణ పతాక రెపరెపలు

**కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడి**

2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతకాన్ని ఎగరవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2026లో మానవరహిత అంతరిక్ష యాత్ర చేపట్టడానికి భారత్ చర్యలు తీసుకుంటోందన్నారు. 'వ్యోమ్మిత్ర' అనే రోబోతో ఆ యాత్రను చేపట్టబోతున్నామని వెల్లడించారు.ఆతర్వాత 2027లో భారత్ నేతృత్వంలో తొలి మానవ అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2035కల్లా మనకూ సొంత అంతరిక్ష స్టేషన్ ఉంటుందన్నారు. 2040లో భారత వ్యోమగామి చంద్రునిపై సగర్వంగా భారత జెండా ఎగరేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2014లో ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ అంతరిక్ష సంస్కరణలను చేపట్టారన్నారు.

### శుక్లాపై చర్చ..ప్రతిపక్షాల వాకౌట్

లోక్సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ భారత వ్యోమగామి శుక్లా గురించి ప్రసంగిస్తున్న సమయంలో ప్రతిపక్షాలు బిహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ.. నినాదాలు చేశారు. శుక్లాపై ప్రసంగం పూర్తి కాకముందే సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. ప్రతిపక్షాల తీరును ఎన్డీఏ నేతలు తీవ్రంగా విమర్శించారు. దేశం అభివృద్ధి చెందడం, ముందుకు వెళ్లడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే ఈ విధంగా ప్రవర్తిస్తారని.. ఇది ఏమాత్రం అమోదయోగ్యం కాదని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మాత్రం సోషల్ మీడియా వేదికగా శుక్లా ఘనతను ప్రశంసించారు. ఆయన అంతరిక్ష యాత్ర దేశానికి గర్వ కారణమని కొనియాడారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ఐఎస్ఎస్) శుక్లా మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను నిర్వహించారన్నారు.

### తక్కువ అరిచి.. ఎక్కువగా ప్రశ్నలు అడిగితేనే ప్రజలకు ప్రయోజనం: స్పీకర్

సమావేశం మధ్యలో విపక్ష ఎంపీలు నినాదాలు చేయడంపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. సభల్లో ప్రతిపక్ష నేతలు అర్థవంతమైన ప్రశ్నలు అడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది కానీ ఇలా కాదని చురకలు అంటించారు. సభను మధ్యలో నిలిపివేసేలా నిరసనలు చేపట్టడం సరైన చర్య కాదన్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్

**ఖరారు చేసిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు**



కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ (67) పేరు ఖరారైంది. ఆదివారం సాయంత్రం భాజపా ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్వర్యంలో జరిగిన భాజపా పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఆయన పేరును ఎంపిక చేశారు. తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. అంతకుముందు ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ గవర్నర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న రాధాకృష్ణన్ ఓబీసీ నేత, తమిళనాడులో బలమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి, రెండుసార్లు కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వహించిన రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు నడ్డా పిలుపునిచ్చారు. లోక్‌సభ రాజ్యసభ ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు మెజారిటీ ఉండటంతో రాధాకృష్ణన్ ఎన్నిక దాదాపు ఖాయంగానే కనిపిస్తుంది.

### దక్షిణాదికి ప్రాధాన్యం దక్కేలా

దక్షిణాది రాష్ట్రాల నాయకులపై భాజపా నాయకత్వం చిన్నచూపు చూస్తోందన్న అపవాదును సరిదిద్దుకొనే ప్రయత్నంలో భాగంగానే సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది. దక్షిణాది భాజపాలో అత్యంత సీనియర్ కావడం, అరెస్సెస్ మద్దతు ఉండటంతోపాటూ 2036లో తమిళనాడు ఎన్నికలు జరగనుండటం లాంటి కారణాలతో భాజపా రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు పదవీ కాలం పూర్తయిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం ఎక్కువగా వినిపించింది. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ప్రస్తావించడంతోపాటు, దక్షిణాది నుంచి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3022లో లోక్‌సభ రాజ్యసభకు సభాపతులుగా ఓంబిర్లా, జగదీప్ ధన్‌కడ్‌లు ఎన్నికయ్యారు. ఇద్దరూ రాజస్థాన్‌కు చెందినవారే కావడంతో ప్రాంతీయ సమతుల్యం దెబ్బతిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 17వ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడంతో భాజపా లెక్క సరిచేసుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు భాజపా నాయకత్వం గవర్నర్లనే ఎంచుకుంటోంది. మోదీ అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి 2017లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలో అప్పటి బిహార్ గవర్నర్ రామనాథ్ కోవింద్‌కు అవకాశం కల్పించారు. 2022లో రాష్ట్రపతిగా పోటీచేసిన ద్రౌపదీముర్ము 2015 మే నుంచి 2021 జూలై వరకు ఝార్ఖండ్ గవర్నర్‌గా సేవలందించారు. 2022లో ఉపరాష్ట్రపతి పదవికి పోటీచేసిన జగదీప్ ధన్‌ఖడ్ అప్పటికి పశ్చిమబెంగాల్ గవర్నర్గా ఉన్నారు. ఇప్పుడు వారి సరసన సీపీ రాధాకృష్ణన్ చేరనున్నారు. ఆరెస్సెస్, భాజపాలకు కొత్త అయిన జగదీప్ ధన్‌ఖడ్‌ను రెండో అత్యున్నత రాజ్యాంగ పీఠంపై కూర్చోబెట్టి కొంత చేదు అనుభవాన్ని చవిచూసిన భాజపా నాయకత్వం ఈసారి ఆచితూచి వ్యవహరించింది. ప్రభుత్వం, పార్టీ వ్యవహారశైలి గురించి క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తిని ఎంచుకొంది.

## వివాదరహితుడు.. విశ్వాసపాత్రుడు



దక్షిణ భారత భాజపా నేతల్లో సీపీ రాధాకృష్ణన్ అత్యంత సీనియర్. 'తమిళనాడు మోదీ'గా పార్టీలో ఆయనకు పేరుంది. పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడు. పైగా వివాద రహితుడు. అందుకే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా భాజపా ప్రకటించింది. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించిన సీపీ రాధాకృష్ణన్ 16వ ఏట నుంచి ఆరెస్సెస్, జన్‌సంఘ్‌లతో కలిసి పనిచేశారు. ఆ అనుభవమే. దేశ రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించేస్థాయికి తీసుకెళ్తోంది. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 1998, 1999 ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2004 నుంచి 2007 వరకు తమిళనాడు భాజపా అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో 16 రోజులపాటు తమిళనాడులోని ప్రతి నియోజకవర్గాన్ని చుడుతూ 18వేల కిలోమీటర్లమేర రథయాత్ర నిర్వహించి నదుల అనుసంధానం... అంటరానితనం, ఉగ్రవాదం నిర్మూలన గురించి ప్రచారం చేపట్టారు. మోదీ తొలిసారి ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్సభ స్థానం నుంచి పోటీ చేసి 3.80 లక్షల ఓట్లతో రెండోస్థానానికి పరిమితమయ్యారు.

2019 ఎన్నికల్లోనూ అదే స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2023 ఫిబ్రవరి 12న తొలిసారి ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2024 మార్చి 18న అప్పటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో ఆ మరుసటిరోజు నుంచి తెలంగాణ గవర్నర్‌గా పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జూలై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయి ప్రస్తుతం అక్కడే సేవలందిస్తున్నారు. ఈయన ఉపరాష్ట్రపతి పదవి వేపడితే సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్ వెంకటరామన్ల తర్వాత తమిళనాడు నుంచి ఆ పీఠాన్ని అధిష్టించిన మూడో వ్యక్తిగా రికార్డులకెక్కుతారు. 2016-20 మధ్యకాలంలో కాయిర్ (కొబ్బరి పీచు) బోర్డు చైర్మన్ గా సేవలందించారు. 2004లో ఐక్యరాజ్యసమితికి వెళ్లిన భారత పార్లమెంటరీ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఐరాస జనరల్ అసెంబ్లీ 58వ సమావేశంలో ప్రసంగించారు. 2030లో కేరళ భాజపా వ్యవహారాల ఇన్చార్జిగా నియమితులై 2022 వరకు పనిచేశారు.

### రాధాకృష్ణను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం

ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన రాధాకృష్ణన్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యసభను సమర్థంగా నిర్వహించి అందరి మన్ననలు పొందుతారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### తుదిశ్వాస వరకూ దేశసేవలోనే...

నన్ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు ప్రధాని మోదీ, భాజపా, ఎన్డీయే పక్షాలకు ధన్యవాదాలు. నాపై ఉంచిన నమ్మకం దేశానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించడం నన్ను కదిలించింది. మాటల్లో చెప్పనలవికాని భావోద్వేగానికి గురయ్యాను. నా తుదిశ్వాస వరకూ దేశం కోసం పనిచేస్తానని రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

## కేంద్ర క్యాబినెట్ అత్యవసర భేటీ



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో ఇటీవల భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించారు. పాత 25శాతం సుంకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అదనపు 25 శాతం టారిఫ్‌లు ఈ నెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. సుంకాల విషయంలో ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అత్యవసరంగా సోమవారం సాయంత్రం ఆరున్నర గంటలకు ఢిల్లీలోని తన నివాసంలో కేంద్రమంత్రులతో భేటీ అయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మోదీ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ ఆర్థిక సలహా మండలి సమావేశానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా ఏడుగురు కేంద్ర మంత్రులు హాజరైనట్లు సమాచారం. సమావేశంలో దేశంలోని ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితిని అంచనా వేసి దాని ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు చేరుకున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికాతో వాణిజ్య సంబంధాలలో అనిశ్చితి, బీజింగ్, మాస్కోలతో వాణిజ్య సంబంధాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో కేంద్రం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## వాషింగ్టన్‌కు జెలెన్‌స్కీ

**ఐరోపా దేశాల నేతలు కూడా...**

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ..అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాషింగ్టన్ డీసీలో సమావేశం నేపథ్యంలో జెలెన్‌స్కీ వాషింగ్టన్ చేరుకున్నారు. ఆయనతో పాటు ఐరోపా దేశాల నేతలూ వచ్చారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అర్సులా వాన్‌డర్ లేయన్, ఫిన్‌ల్యాండ్ ప్రధాని అలెగ్జాండర్ స్టబ్, ఇటాలియన్ ప్రధాని జార్జియా మెలోనీ తదితరులు జెలెన్‌స్కీకి మద్దతుగా పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా వచ్చారు.



ఆమెరికా చేరుకున్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

# రష్యా నుంచి చమురు కొనుగోలు

**❑ ట్రంప్ సలహాదారు అక్కసు**

అమెరికా చేస్తున్న తాటాకు చప్పుళ్లకు భయపడకుండా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం ట్రంప్ కార్యవర్గానికి కంటగింపుగా మారింది. తాజాగా శ్వేతసౌధంలోని ఆయన కీలక సలహాదారు పీటర్ నవారో మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికాకు ఓ వ్యూహాత్మక భాగస్వామిలా భారత్ వ్యవహరించాలన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ రాసిన ఓ కాలమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా, రష్యాతో సన్నిహిత సంబంధాల కోసం భారత్ చూస్తోందన్నారు. ఇప్పుడు ఆ రెండు దేశాల సంబంధాల విషయంలో సౌకర్యవంతంగా ఉందన్నారు. "భారత్‌ను అమెరికా ఓ వ్యూహాత్మక భాగస్వామిగా చూడాలి అంటే న్యూదిల్లీ కూడా ఆ విధంగానే వ్యవహరించాలి. రష్యా చమురుకు న్యూఢిల్లీ గ్లోబల్ క్లియరింగ్ హౌస్ పనిచేస్తోంది. ఆంక్షల పరిధిలోని చమురును విలువైన గూడ్స్ కింద మార్చి ఎగుమతులు చేస్తోంది. మాస్కోకు అవసరమైన డాలర్ను సమకూరుస్తోంది" అని ఆ వ్యాసంలో పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే.. ఆది ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చినట్లు అవుతుందన్నారు. చైనా, రష్యాతో న్యూఢిల్లీ సంబంధాల నేపథ్యంలో అత్యాధునిక సైనిక టెక్నాలజీని విక్రయించడం రిస్క్‌తో కూడుకొన్న పని అని పేర్కొన్నారు.

భారత్–అమెరికా మధ్య 25–29 మధ్య జరగాల్సిన వాణిజ్య చర్చలు రద్దయిన తర్వాత పీటర్ నవారో వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ఈ నేపథ్యంలో భారత్‌పై ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో మొత్తం భారత వస్తువులపై అమెరికా సుంకాలు 50శాతానికి చేరనున్నాయి. ఈ చర్యలను భారత్ దురదృష్టకరమైనవిగా అభివర్ణించింది. తమ సంప్రదాయ విక్రేతలు ఐరోపా వైపు మళ్లడంతో.. రష్యా చమురు కొనుగోలు చేయాల్సి వస్తోందని వివరణ ఇచ్చింది. తమను నిందిస్తున్న దేశాలు కూడా రష్యాతో వ్యాపారంలో ఉన్నాయని.. అది కూడా తమ వలే జాతీయ అవసరాల కోసం చేసి కాదని విదేశాంగ శాఖ దుయ్యబట్టింది.

రష్యాతో చమురు కొనుగోలుపై ఆమెరికా ద్వంద్వ వైఖరి అవలంభిస్తోంది. భాంత్‌పై అదనపు సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా విషయంలో మాత్రం మెతక వైఖరిని ప్రదర్శిస్తున్నారు. బీజింగ్‌పై సుంకాల విషయంలో వెనక్కి తగ్గడంపై తాజాగా యూఎస్ విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ.. చైనాపై ద్వితీయ ఆంక్షలు విధిస్తే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అందుకే ఈ విషయంలో చైనాపై మాత్రం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు.

# సూట్‌కేసులతో పుతిన్ బాడీగార్డులు

### అలస్కా ట్రిప్‌పై కథనాలు

అలస్కా: రష్యా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్ ఆరోగ్యంపై గత కొద్దికాలంగా విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ఆయనకు ఆరోగ్యం సరిగాలేదని, పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నాడని, ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో ఆయన ఆరోగ్య పరిస్థితి బయట ప్రపంచానికి తెలియకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారని అడపాదడపా కథనాలు వస్తుంటాయి. ఇప్పుడు మరోసారి అలాంటి కథనాలే వెలుగుచూశాయి. గత శుక్రవారం అలస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పుతిన్ సమావేశమయ్యా యి. ఉక్రెయిన్ విషయంపై చర్చ జరిపారు. అలస్కా ట్రిప్‌లో పుతిన్ భద్రతా వివరాలు తాజాగా వెలుగుచూశాయి. ఈ ట్రిప్ కోసం పుతిన్ బాడీగార్డులు మలసేకరణ సూట్‌కేసులు తీసుకువెళ్లారని సమాచారం. పుతిన్ మల, మూత్రాలు విసర్జిస్తే ప్రత్యేక బ్యాగుల్లో సేకరించి వాటిని సూట్‌కేసుల్లో పెట్టి రష్యాకు తీసుకు వెళ్తారని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇదే విషయాన్ని 2022లో ఇద్దరు వెటరన్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు రేజిస్ జెంటే, మిఖైల్ రూబిన్‌లు ఫ్రెంచ్ పబ్లికేషన్ పారిస్ మ్యాచ్‌లో రాశారు. రష్యా అధ్యక్షుడి విదేశీ ప్రయాణాల్లో ఫెడరల్ ప్రొటక్షన్ సర్వీస్ (ఎఫ్‌పీ ఎస్) ఆయన మల, మూత్రాలను సేకరిస్తుంటుందని అందులో పేర్కొన్నారు. కాగా పుతిన్ అలస్కా టూర్‌లో పుతిన్ బాడీగార్డులు ఆయన వెన్నంటే ఉన్నారు. వీరిలో ఒకరు మల మూత్రాలు సేకరించి రష్యాకు తీసుకువెళ్లే ప్రత్యేక బాధ్యతను చూసుకుంటారు. పుతిన్ ఆరోగ్యంపై బయట ప్రపంచానికి ఏ మాత్రం తెలియకుండా ఉండటానికే ఈ ఏర్పాటని చెబుతున్నారు. 2017 మేలో పుతిన్ ఫ్రాన్స్‌లో పర్యటన సమయంలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఆ సమయంలో ఆయన పోర్టబుల్ టాయిలెట్ వాడినట్టు కథనాలు వచ్చాయి. రష్యా అధినేతగా 1999లో పుతిన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇలాంటి జాగ్రత్తలే ఆయన తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. 72 ఏళ్ల పుతిన్ ఆరోగ్యంపై ఇటీవల కాలంలో అనేక పుకార్లు షికార్లు చేశాయి. గత నవంబర్‌లో కజకిస్థాన్‌లో మీడియా సమావేశం జరిగినప్పుడు ఆయన కాళ్లు ఇబ్బందికరంగా కనిపించాయి. దీంతో ఆయన పార్కిన్‌సన్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నారనే ప్రచారం జరిగింది.





## గాల్లో ఉండగా విమానంలో మంటలు

**అత్యవసర ల్యాండింగ్‌తో తప్పిన ప్రమాదం**

ఓ పెను ప్రమాదం నుంచి వందల మంది విమాన ప్రయాణికులు తప్పించుకున్నారు. విమానం గాల్లో ఉండగా ఏకంగా మంటలు చెలరేగాయి. విమానం టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే ఇంజిన్‌లో మంటలు మొదలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బోయింగ్ 757–300 విమానం గ్రీసులోని కోర్ఫు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి దుస్సెల్ డార్ఫ్ బయలుదేరింది. విమానం టేకాఫ్ అయి గాల్లోకి లేచిన కొన్ని నిమిషాలకే అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. విమానంలో మంటలు చెలరేగాయి. దీంతో విమానంలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఇంజిన్ సరిగా పని చేయకపోవటం వల్ల మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మంటలను గుర్తించిన పైలె ట్లు విమా నాన్ని ఇటలీ వైపు తిప్పారు. బ్రిన్‌డిసి ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండ్ చేశారు. ఇక ఈ సంఘటనపై కాండార్ ఎయిర్‌వేస్ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రయాణికులకు క్షమా పణలు చెప్పింది. ప్రస్తుతం సంఘటనకు సంబంధించిన వీడి యో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదృష్టం కొద్దీ విమానం పేలలేదు.. లేదంటే వందల మంది చనిపోయే వారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## నైజీరియాలో ఓ పడవ బోల్తా

నైజీరియాలో ఓ పడవ బోల్తా పడడంతో 40 మంది గల్లంతయ్యారు. వాయువ్య సోకోటో రాష్ట్రంలోని స్థానిక గోరోన్యో మార్కెట్కు వెళ్తుండగా పడవ ప్రమాదానికి గురవడంతో నదిలో పడి 40 మంది గల్లంతవగా.. పది మందిని రక్షించినట్లు జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో అందులో 50 మంది ఉన్నట్లు పేర్కొంది. గల్లంతైన వారికోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మూడు వారాల క్రితం ఉత్తర–మధ్య నైజీరియాలో నైజర్ రాష్ట్రంలో ఇదేవిధంగా పడవ బోల్తా పడగా 13 మంది మరణించారని.. గల్లంతయిన కొందరి ఆచూకీ ఇప్పటికీ తెలియలేదన్నారు.



## పాక్‌లో వెయ్యి దాటిన మృతులు


**ప్రకృతి విలయంతో అధికారుల్లో ఆందోళన**

ప్రకృతి ప్రకోపానికి పాక్ అల్లాడుతోంది. ఖైబర్‌ఫాఖ్‌తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో బీభత్సమైన వర్షాలు, వరదల కారణంగా వందలమంది మరణించారు. మృతుల సంఖ్య 1000కి పైగానే ఉండొచ్చని ఉన్నతస్థాయి అధికారి ఇఖ్తియార్ వలీఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ముంపునకు గురైన ప్రాంతాలను తాను స్వయంగా సందర్శించానని ఆయన తెలిపారు. అనేక గ్రామాలు వరదల్లో తుడిచిపెట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బునర్ జిల్లా ఛర్గాజీ గ్రామంలో ఊహకు అందని స్థాయిలో విధ్వంసం సంభవించిందని చెప్పారు. బాషోనీ అనే గ్రామం అనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకు పోయిందని అన్నారు. భారీ ట్రక్కులంత సైజులో ఉన్న రాళ్లు వరదల కారణంగా జనావాసాల వైపు దూసుకొచ్చాయని చెప్పారు. ఈ వరదల బారిన పడ్డ కొన్ని కుటుంబాలు ఏమైపోయాయో కూడా తెలియట్లేదని చెప్పారు. అధికారిక లెక్కల ప్రకారం మృతుల సంఖ్య 300గా ఉన్నప్పటికీ అనేక కేసుల గురించి రికార్డుల్లోకే ఎక్కలేదని తెలిపారు. ఒక్క దిర్ ప్రాంతంలోనే మరణాల సంఖ్య వెయ్యి దాటే అవకాశం ఉందని విచారం వ్యక్తం చేశారు. 'బునర్ నుంచి ఇప్పుడే తిరిగొచ్చా. ఆ భయానక దృశ్యాల ను స్వయంగా చూశా' అంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పాక్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం, వర్షాలు, వరదల కారణంగా జూన్ 26 నుంచి ఇప్పటివరకూ అక్కడ 657 మంది మృతిచెందారు. మృతుల్లో 392 మంది పురుషులు ఉన్నారు. మరో 939 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో 437 మంది పురుషులు, 256 మంది చిన్నారులు, 236 మంది మహిళలు ఉన్నారు. స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలు చేపడుతున్నామని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది.

# చైనాను వదిలేసి భారత్‌పై సుంకాలు

### ఎందుకో చెప్పిన అమెరికా విదేశాంగ మంత్రి

రష్యా చమురును కొనుగోలు చేస్తున్న చైనాను ఉపేక్షించి భారత్‌పై సుంకాలు విధించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో తాజాగా వివరణ ఇచ్చారు. చైనాపై అదనపు సుంకాలు విధిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని అంటుతాయని అన్నారు. రష్యా నుంచి కొనుగోలు చేస్తున్న చమురులో అధిక శాతాన్ని చైనా శుద్ధి చేసి ఇతర దేశాలకు విక్రయిస్తోందని మార్కో రూబియో తెలిపారు. ఈ దశలో చైనాపై సుంకాలు విధిస్తే మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. 'రష్యా నుంచి చైనా కొనుగోలు చేస్తున్న చమురులో అధిక శాతం ఐరోపా దేశాలు కొంటున్నాయి. ఇది కాకుండా సహజవాయువును కూడా కొనుగోలు చేస్తున్నాయి. ప్రస్తుతం అవి దిగుమతులను తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నాయి.



అయితే, ఈ విషయంలో ఐరోపా చేయాల్సింది ఏంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆంక్షలు విధిస్తే బయ్యర్లు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవాల్సి వస్తుంది. ఇది రేట్లను పెంచుతుంది' అని చెప్పుకొచ్చారు. చైనా, భారత్‌పై ఆంక్షల విధింపు కోసం సెనేట్ బిల్లు రూపకల్పన సమయంలో ఐరోపా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయని అన్నారు. రష్యా చమురు, సహజ వాయువును కొంటున్న ఐరోపా దేశాలపై ఆంక్షలు విధిస్తారా అన్న ప్రశ్నకు కూడా ఆయన సమాధాన మిచ్చారు. ఈ విషయంలో ప్రస్తుతం తన వద్ద సమాచా రం లేకపోయినప్పటికీ రెండో దశ ఆంక్షల ప్రభావాలు కచ్చితంగా ఉండే అవకాశం ఉందని అన్నారు. అయితే, ఈ విషయంలో ఐరోపా దేశాలపై ప్రతీకార చర్యలకు దిగే ఉద్దేశం తనకు లేదని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంలో ఐరోపా దేశా లు నిర్మాణాత్మక పాత్ర పోషించగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భారత్‌పై ఆగస్టు 27 నుంచి 50 శాతం సుంకం విధిస్తామని గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ విషయంలో తెర వెనక చర్చలు జరుగుతున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉంటే, ఆగస్టు 25న ఇరు దేశాల మధ్య జరగాల్సిన ఆరవ విడత చర్చలు వాయిదా పడ్డట్టు కూడా వార్తలు వెలువడ్డాయి. దీంతో భారత్‌పై 50 సుంకం విధింపు తప్పదేమో నన్న అంచనాలు ఉన్నాయి.

# న్యూయార్క్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక







అమెరికాలో విజయ్ దేవరకొండ, రష్మిక సందడి చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూయార్క్ లో జరిగిన ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే కవాతుకు వీరిద్దరూ హాజరయ్యారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా డే పెరేడ్లో ఈ జంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒకరిచేయి ఒకరు పట్టుకొని నడవడంతో ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఎన్నో రోజుల తర్వాత ఇద్దరూ కలిసి కనిపించారని అభిమానులు ఆనందిస్తున్నారు. కొన్ని రోజులుగా వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో మరోసారి న్యూయార్క్ ఫొటోలు వైరల్‌గా మారాయి. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి జంటగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్ గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్లో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఇందులోనూ రష్మికనే కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది.



## ఓటీటీలో దూసుకెళుతున్న
# కానిస్టేబుల్ కనకం

వర్ష బొల్లమ్మ కీలక పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ కానిస్టేబుల్ కనకం ఓటీటీలో రికార్డ్ వ్యూస్‌తో దూసుకెళుతోంది. ప్రశాంత్ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న కానిస్టేబుల్ కనకం ఈటీవీ విన్ ఒరిజినల్ సిరీస్‌గా గత వారం స్ట్రీమింగుకు రాగా ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నాలుగురోజుల్లోనే ఈ వెబ్ సిరీస్ 100 పై చిలుకు మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి మరింత మందికి చేరువ అవుతోందని తెలుపుతూ ఈటీవీ విన్ సరికొత్త పోస్టర్‌ను పంచుకుంది. వైవిధ్యమైన కథ, కథనాలతో పాటు, ప్రతి ఎపిసోడ్ అలరించేలా తీర్చిదిద్దారు దర్శకుడు ప్రశాంత్. ముఖ్యంగా చివరి ఎపిసోడ్‌లో వచ్చే ట్విస్టులు అందరినీ అలరిస్తున్నాయి.

'కానిస్టేబుల్ కనకం' సిరీస్‌కు కొనసాగింపు ఉంటుందని చివరిలో చూపించారు. కనిపించకుండాపోయిన చంద్రిక ఏమైంది? అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నలు సంధిస్తున్నారు. వాటికి సమాధానం తెలియాలంటే సీజన్2 కోసం వేచి చూడాల్సిందే. అసభ్య సన్నివేశాలు, సంభాషణలకు తావులేకుండా కుటుంబంతో కలిసి చూసేలా సిరీస్‌ను తీర్చిదిద్దడంతో ఇది కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతోంది. అంతేకాదు, ఫస్ట్ ఎపిసోడ్‌ను చితంగా చూసే వెసులుబాటును ఈటీవీ విన్ కల్పిస్తోంది.

**కథ విషయానికొస్తే..**

శ్రీకాకుళం జిల్లాలోని రేపల్లె గ్రామ సమీపంలోని అడవిగుట్ట వైపు ఎవరు వెళ్లినా కనిపించకుండా పోతారు. ముఖ్యంగా మహిళలు అటువైపు వెళ్లడానికి వీల్లేదని ఊరి ప్రెసిడెంట్ (అవసరాల శ్రీనివాస్) ఆదేశాలు జారీ చేస్తాడు. పొరపాటున అటువైపు వెళ్లిన ముగ్గురు మహిళల ఆచూకీ లభ్యం కాదు. అదే గ్రామానికి మహిళా కానిస్టేబుల్‌గా వస్తుంది కనక మహాలక్ష్మి అలియాస్ కనకం (వర్ష బొల్లమ్మ). ఆ ఊరికి వస్తున్న సమయంలో పరిచయమైన చంద్రిక (మేఘ లేఖ) స్నేహితురాలై ఆమెతో విడదీయరాని అనుబంధం ఏర్పడుతుంది. ఒకరోజు కనకం, చంద్రిక కలిసి బండిపై వెళుతుండగా ప్రమాదం జరుగుతుంది. ఆ తర్వాత నుంచి చంద్రిక కన్పించకుండాపోతుంది. ఇంతకీ చంద్రిక ఏమైంది? అడవిగుట్టలో దాగిన మర్మం ఏంటి? అక్కడికి వెళ్లిన మహిళలు ఏమవుతున్నారు? కానిస్టేబుల్ కనకం ఈ మిస్టరీని ఎలా ఛేదించింది? అన్నది సిరీస్.

# మహేశ్ బాబు సమర్పణలో రావు బహదూర్

వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం రావు బహదూర్. ఈ సినిమాను జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. తాజాగా దీని టీజర్‌ను దర్శకధీరుడు రాజమౌళి విడుదల చేశారు. "నాకు అనుమానం అనే భూతం పట్టిందంటూ..' అంటూ ఆసక్తికరమైన డైలాగుతో ఈ వీడియో ప్రారంభమైంది. సైకలాజికల్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దినట్లు టీజర్ ఆధారంగా తెలుస్తోంది. వచ్చే వేసవికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



అనుమానం ఒక పెను భూతం అని వినే ఉంటాం. మనిషికి ఎలాంటి జబ్బు వచ్చినా నయం చేయగలరేమో కానీ, అనుమానం అనే జబ్బు మాత్రం రాకూడదు. అది కనుక వచ్చింది అంటే వారి చేతులతో వారి జీవితాలనే నాశనం చేసుకుంటారు. అదే అనుమానంతో రావు బహదూర్ కూడా తన జీవితాన్ని ఎలా నాశనం చేసుకున్నాడో వెంకటేష్ మహా.. రావు బహదూర్ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నాడు. కేరాఫ్ కంచరపాలెం సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్‌గా మారారు వెంకటేష్. ఆ సినిమా ఇచ్చిన విజయాన్ని వెంకటేష్ సరిగ్గా ఉపయోగించుకోలేకపోయాడు. వివాదాలతో కొంతవరకు నెగిటివిటీ తెచ్చుకున్న వెంకటేష్ చాలా గ్యాప్ తరువాత ఒక మంచి కథను ఎంచుకున్నాడు. అదే రావు బహదూర్.

చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ను ప్రారంభించి హీరోగా మారాడు సత్యదేవ్. హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకోగలుగుతున్నాడు కానీ, విజయాలను దక్కించుకోలేకపోతున్నాడు. ఈ ఏడాది రిలీజ్ అయిన కింగ్‌డమ్ లో సత్యదేవ్ నటనకు మంచి గుర్తింపు దక్కింది. టాలెంట్ ఉన్నా కూడా ఈ కుర్ర హీరోకు ఒక మంచి కథ పడడం లేదు అని అనుకుంటున్న సమయంలో సూపర్ స్టార్ మహేష్ బాబు.. సత్యదేవ్ టాలెంట్ ను గుర్తించి సూపర్ కథతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాడు. సత్యదేవ్ ప్రధాన పాత్రలో వెంకటేష్ మహా దర్శకత్వం వహిస్తున్న చిత్రం రావు బహదూర్. మహేష్ బాబు, నమ్రత నిర్మిస్తున్న ఈ సినిమాలో దీప థామస్ హీరోయిన్ గా నటిస్తోంది.

సైకలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్‌కు మించి అంటూ రిలీజ్ చేసిన ఈ టీజర్ అద్భుతం ఆకట్టుకుంటుంది. మొట్ట మొదటిసారి సత్యదేవ్ టాలెంట్ కు పర్ఫెక్ట్ సినిమా అని టీజర్ చూసాక నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు. ఇక టీజర్ విషయానికొస్తే.. ఇది ఈ జనరేషన్‌లో జరిగిన కథ కాదు. ఎప్పుడో తాతల నాటి కాలంలో ఒక రాజుగారు .. తన ఊరులో ఉన్న బంగ్లాకు వస్తాడు. అక్కడ అతనికి ఒక అమ్మాయి నచ్చుతుంది. ఆ బంగ్లాలో వారి ప్రేమ ఎంతో బాగా కొనసాగుతుంది. అయితే రోజులు గడుస్తున్నకొద్దీ రాజుగారిలో ఆమె పై అనుమానం.. పెనుభూతంగా మారి అతడిని రాక్షసుడిగా మారుస్తుంది. చివరికి ఆ ప్రేమించిన అమ్మాయిని రాజుగారు ఏం చేశారు.. ? అనుమానంతో అతడి జీవితం ఎన్ని మలుపులు తిరిగింది.. ? రావు బహదూర్ చివరకు ఏమయ్యాడు.. ? అనేది కథగా తెలుస్తోంది.

టీజర్ మొత్తం సత్యదేవ్ వన్ మ్యాన్ షో అని చెప్పొచ్చు. మొదటి నుంచి చివరి వరకు గెటప్‌ల మీద గెటప్ లు మారుస్తూనే ఉన్నాడు. కమల్ హాసన్ కనుక దశావతారం లో ఎలాంటి గెటప్ లు వేశాడో.. సత్యదేవ్ కూడా ఈ సినిమాలో అన్ని గెటప్స్ లో కనిపించాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. మరి ఈ సినిమాతోనైనా సత్యదేవ్ మంచి హిట్ ను అందుకుంటాడేమో చూడాలి.



## కోట సతీమణి కన్నుమూత

దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సతీమణి రుక్మిణి సోమవారం కన్నుమూశారు. కోట శ్రీనివాసరావు జులై 13న తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన ఇకలేరన్న వార్త మరువక ముందే కోట సతీమణి మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు, అందరినీ కలచివేస్తోంది.

## సుహాస్‌కు మంచి భవిష్యత్ ఉంది

కొత్త కాన్సెప్టులను ఎంచుకుని సినిమాలు తీస్తున్న సుహాస్ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి వెళ్తాడని అభినందించారు సీనియర్ నటుడు నరేష్ అభినందించారు. సుహాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'హే భగవాన్'. ఇందులో నరేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా జరిగిన దీని టైటిల్ లాంచ్ ఈవెంట్లో నరేష్ మాట్లాడుతూ కొన్ని సినిమాలను అంగీకరించాలంటే డేట్స్ సర్దుబాటు చేయలేనేమోనని భయమేస్తుందన్నారు. ఇప్పటివరకూ డేట్స్ విషయంలో నాపై ఒక్క ఫిర్యాదు కూడా లేదు. 'సామజవరగమన' కథ విన్నాక నాకు అందులో నటించడానికి డేట్స్ లేక చేయలేనని చెప్పా. అనిల్ సుంకర నెల రోజులు నాకోసం ఎదురుచూశారు. అద్భుతంగా వచ్చిన ఆ సినిమాను నా జీవితంలో మర్చిపోలేను. నేను ఎంత ఆలస్యమైనా ఎన్ని కథలైనా వింటాను. అలానే 'హే భగవాన్' కథ విన్నాక ఈ చిత్రాన్ని మిస్ అవ్వకూడదు అనుకున్నాను. అందుకే అంగీకరించాను. నాకోసం షూటింగ్ తేదీల్లో కొన్ని మార్పులు చేసినందుకు దర్శక నిర్మాతలకు థాంక్స్ చెప్పాలి. నేను ఏది మాట్లాడినా ఉన్నది ఉన్నట్లు చెబుతాను. ఇది అద్భుతమైన చిత్రం. టైటిల్ తోనే అందరిలో ఆసక్తి కలిగించారు. కొత్త రైటర్స్, దర్శకులే ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీకి దీపాలు. కొత్త కాన్సెప్ట్ తో అలరిస్తున్నారు. ఒకానొక సమయంలో మలయాళం, తమిళ సినిమాలు చూసి ఇలాంటి కథలు తెలుగులో రావా అనుకునేవాళ్లం. ఇది కంటెంట్ యుగం. సుహాస్ కోసం దర్శకులు కంటెంట్ తయారుచేస్తున్నారు.. హీరో కోసం ప్రత్యేకంగా కథలు రాయడమనేది నిజంగా గర్వకారణం. ఇంతకుముందు తమిళ, మలయాళ కథలను తెలుగులో రీమేక్ చేసేవాళ్లం. ఇప్పుడు ఇలాంటి సినిమాల తర్వాత తెలుగు కథలను మరో భాషలోకి రీమేక్ చేస్తారని నరేష్ అన్నారు.

'హే భగవాన్' సినిమా టైటిల్ గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. హీరోహీరోయిన్లు ఇద్దరూ వారి కుటుంబ నేపథ్యం గురించి చెబుతూ ప్రేక్షకులకు నవ్వులు పంచారు. గోపి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో సుహాస్ సరసన శివానీ నగరం నటిస్తున్నారు.

